www.prajapaksham.in
ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
బుధవారం | 26 | నవంబర్ | 2025
పేజీలు : 8

# రేపు పోటు ప్రసాద్ వర్ధంతి సభ



**ప్రజాపక్షం/ఖమ్మం :** దివంగత సిపిఐ నాయకుడు, సిపిఐ జిల్లా మాజీ కార్యదర్శి పోటు ప్రసాద్ ప్రథమ వర్ధంతి సభ ఈనెల 27న ఉదయం 10 గంటలకు ఖమ్మం సిపిఐ కార్యాలయం గిరిప్రసాద్ భవన్‌లో జరుగుతుందని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ నేడొక ప్రకటనలో తెలిపారు. ఏఐఎస్ఎఫ్ నాయకునిగా అనేక విద్యార్థి ఉద్యమాలకు నాయకత్వం వహించిన పోటు ప్రసాద్ ఆ తర్వాత ఏఐటియుసి నాయకునిగా కార్మిక వర్గం సమస్యల పరిష్కారం కోసం కృషి చేశారన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శిగా, రాష్ట్ర కార్యవర్గ సభ్యునిగా పనిచేసిన పోటు ప్రసాద్ తుదిశ్వాస వరకు నిబద్ధత కలిగిన కమ్యూనిస్టుగా పార్టీ బలోపేతానికి కృషి చేశారని సురేష్ తెలిపారు. ఆయన కృషి, పట్టుదలను స్మరించుకుని ఆశయ సాధనకు పునరంకితమయ్యేందుకు ప్రథమ వర్ధంతి సభ నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. పోటు ప్రసాద్ స్మారక స్తూపం గల బోనకల్ రోడ్, ఇందిరా నగర్ వద్ద ప్రత్యేక కార్యక్రమాలు చేయనున్నట్లు సురేష్ తెలిపారు.

# పంచాయతీ పోరు..!

## మూడు విడతల్లో ఎన్నికలు




-అమల్లోకి ఎన్నికల కోడ్
- డిసెంబర్ 11, 14, 17 తేదీల్లో ఎన్నికలు

**ప్రజాపక్షం/ఖమ్మం :** పంచాయతీ ఎన్నికలకు సంబంధించి నగరా మోగింది. డిసెంబర్ 11, 14, 17 తేదీల్లో ఎన్నికలు నిర్వహించనున్నట్లు రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. ఖమ్మం జిల్లాలో సైతం మూడు విడతల్లో ఎన్నికలు మిగతా 2లో..

## భూ విజ్ఞాన శాస్త్ర పరిశోధనలో
# ముందడుగు ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ

- నియోజకవర్గానికి అరుదైన గౌరవం
- డిసెంబర్ 2న సిఎం చేతుల మీదుగా యూనివర్సిటీ ప్రారంభం
- యూనివర్సిటీని సందర్శించి పనులు పరిశీలించిన ఎంఎల్ఏ కూనంనేని



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** కొత్తగూడెం నియోజకవర్గంలో ప్రారంభం కానున్న డా.మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ భూ విజ్ఞాన శాస్త్ర పరిశోధనలో కీలక ముందడుగని, ఇది భద్రాద్రి జిల్లాకు దక్కిన అరుదైన గౌరవం అని కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చేతుల మీదుగా త్వరలో ప్రారంభం కానున్న యూనివర్సిటీ ప్రాంగణాన్ని మంగళవారం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్‌తో కలిసి ఆయన పరిశీలించారు. భవన సముదాయాలు, తరగతి గదులు, పరిశోధన శాలలు, క్రీడామైధానాలను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ త్వరలో ముఖ్యమంత్రి పర్యటన ఉందని, త్వరితగతిన పనులు పూర్తి చేయాలని మిగతా 2లో..

# సామినేనిది ముమ్మాటికీ రాజకీయ హత్యే



-హంతకులను తేల్చడంలో రాజకీయ ఒత్తిళ్లు
-సిపిఎం మహాధర్నా.. కలెక్టరేట్ వద్ద ఉద్రిక్తత

**ప్రజాపక్షం/ఖమ్మం :** సిపిఎం నేత సామినేని రామారావు ది ముమ్మాటికి రాజకీయ హత్యేనని హంతకులను తేల్చడంలో పోలీసుల పై రాజకీయ ఒత్తిడి ఉందని సిపిఎం నేతలు ఆరోపించారు. అధికార పార్టీకి పోలీసులు గులాంగిరి చేస్తున్నారని సిపిఎం నాయకున్ని హత్య చేస్తే సిపిఎం నాయకులు ప్రశ్నించరా అని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ పోలీసుల తీరుపై తీవ్ర విమర్శలు చేశారు. మంగళవారం సామినేని హంతకులను తేల్చి అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ధర్నాచౌక్ వద్ద మహాధర్నా నిర్వహించారు. జిల్లా నలుమూలల నుండి వందలాది మంది సిపిఎం కార్యకర్తలు ఈ ధర్నాకు తరలివచ్చారు. ఒక దశలో తీవ్ర ఉద్రిక్తత ఏర్పడింది. సిపిఎం నాయకులు కలెక్టరేట్ వద్ద ఆందోళన నిర్వహించారు. పరిస్థితి విషమించడంతో మిగతా 2లో..

## వంతెన పిల్లర్‌లలో
# నాణ్యత ఎంత..?



-మట్టి నింపితేనే
కూలిన పిల్లర్
-పర్యవేక్షణ లోపమా..
కమిషన్ల కక్కుర్తా?



2లో

వంతెన నిర్మాణలో నాణ్యతా లోపం కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది. రూ. 5.31 కోట్లతో నిర్మిస్తున్న వంతెన పిల్లర్ నిర్మాణ దశలోనే కూలిపోవడం ఇప్పుడు జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఒక పక్క ప్రభుత్వం నాణ్యత లేని నిర్మాణాలకు తావు లేదని చెబుతుంటే యంత్రాంగం మాత్రం అవేమి మాకు పట్టవులే అన్నట్లు వ్యవహరిస్తుంది. మట్టి పోస్తేనే పిల్లర్ కూలితే రేపు వరదకు మిగిలిన పిల్లర్లు నిలబడతాయా అన్న ప్రశ్నకు ఇంజనీరింగ్ అధికారులే సమాధానం చెప్పలేని స్థితి.

-ప్రజాపక్షం/వైరా

# సామినేనిది ముమ్మాటికీ రాజకీయ హత్యే






(మొదటిపేజీ తరువాయి)

సిపిఎం నేతలను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ధర్నాలో జాన్‌వెస్లీ మాట్లాడుతూ ఖమ్మం సిపి వ్యవహారం భయపెట్టే రీతిలో ఉందని సిపి కాంగ్రెస్ నాయకునిలా వ్యవహరిస్తున్నారని ఆయన ఆరోపించారు. నిందితులను అరెస్టు చేయకుంటే రాష్ట్ర వ్యాప్త ఆందోళన చేపడతామని ఆయన హెచ్చరించారు. పక్షపాతంగా, నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరైంది కాదని చట్ట ప్రకారమే అరెస్టు చేయాలని కోరడంలో తప్పేంటని ఆయన ప్రశ్నించారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ మాట్లాడుతూ పోలీసుల తీరు అత్యంత హాస్యాస్పదంగా ఉందని హంతకులను పట్టుకునే దిశగా కాకుండా పక్కదారి పట్టించే రీతిలోవిచారణ సాగుతుందన్నారు. మల్లు భట్టివిక్రమార్క ఆయన భార్య నందిని ఒత్తిడితో పోలీసులు ఉన్నారని ఆయన తెలిపారు. మధిర నియోజక వర్గంలో జరుగుతున్న దురాఘాతాలపై ముఖ్యమంత్రి దృష్టి సారించాలన్నారు. భట్టి ఈ హత్యకు బాధ్యత వహించాలని హంతకులను పట్టుకునేంత వరకు ఆందోళనలు కొనసాగిస్తామన్నారు. సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు మాట్లాడుతూ సామినేని రామారావుది ముమ్మాటికి రాజకీయ హత్యేనని గత నెల 31న రామారావు హత్యకు గురి కాగా ఇంత వరకు నిందితులను తేల్చడంలో పోలీసుల వైఫల్యం ఉందన్నారు. కేసును సీరియస్‌గా తీసుకుని హంతకులను అరెస్టు చేయకపోతే శాంతి భద్రతల సమస్యగా మారే ప్రమాదం ఉందన్నారు. హంతకులు ఇండ్లలో ఉంటే ప్రజలు ఆందోళన చేయాల్సిన పరిస్థితి వచ్చిందంటే ప్రభుత్వ తీరు ఏవిధంగా ఉందో అవగతమవుతుందన్నారు. ఈ ధర్నాలో జెడ్పి మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్, న్యూడెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి కోలా లక్ష్మీ నారాయణ తదితరులు ప్రసంగించారు. యర్రా శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సభలో సిపిఎం నాయకులు మాచర్ల భారతి, బండి రమేష్, కళ్యాణం వెంకటేశ్వరరావు, విక్రం, బుగ్గవీటి సరళ, భూక్యా వీరభద్రం, మాదినేని రమేష్, వెంకటేశ్వర్‌రావు, బొంతు రాంబాబు తదితరులు పాల్గొన్నారు. పోలీసులు భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. ఇటీవల కాలంలో కలెక్టరేట్ వద్ద ఈ స్థాయిలో పోలీసులు ఎప్పుడు మోహరించకపోవడం గమనార్హం.

# వంతెన పిల్లర్‌లలో నాణ్యత ఎంత..?



ప్రజాపక్షం/వైరా: వైరా మండలం స్నానాల లక్ష్మీ పురం గ్రామం వద్ద రూ.5కోట్లతో చేపట్టిన బ్రిడ్జి పనుల నిర్మాణం దశలోనే పిల్లర్ కూలిపోవడం ఇప్పుడు జిల్లావ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఒకపక్క ప్రభుత్వం క్వాలిటీ లేకుండా పనులు చేస్తే సహించేది లేదని పదేపదే చెబుతూ వస్తూ ఉంది.ఇటీవల వైరాలో యంగ్ ఇండియా స్కూల్ నిర్మాణానికి భూమిపూజ కార్యక్రమానికి వచ్చిన ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమ్కా కూడా అభివృద్ధి పనుల విషయంలో నాణ్యత లోపం వస్తే సహించేది లేదని వేదిక సాక్షిగా అధికారులను హెచ్చరించిన సందర్భంగా కూడా ఉంది. పిల్లర్ కూడిపోవడానికి కారణం ఏమిటని ఆర్అండ్‌బి ఈఈ పవన్‌ను ప్రజాపక్షం వివరణ కోరితే కేవలం మట్టి ఫిల్లింగ్ చేస్తుంటేనే పిల్లర్ కూలిపోయిందని చెప్పడం ఆశ్చర్యానికి గురిచేస్తుంది. ఒక బాధ్యత గల జిల్లా అధికారి తప్పుని ప్రశ్నించాల్సింది పోయి తప్పు చేసిన వారిని వెనుకేసుకు రావడం కూడా పెద్ద తప్పే. బ్రిడ్జి నిర్మాణానికి చేపట్టిన 12 పిల్లర్లలో ఒక పిల్లర్ కూలిపోయింది. ఆ పిల్లర్ పూర్తిగా నాణ్యత లోపంతో సరైన ఐరన్ సువ్వ వాడకపోవడమే కారణమని కూడా పలు విమర్శలు వినిపిస్తున్నాయి. అయితే మిగతా 11 పిల్లర్లు నాణ్యత ఎంత ఏ విధంగా ఉన్నాయి అనేది కూడా అనుమానాలు తావిస్తుంది. కేవలం పిల్లర్ ప్రక్కన మట్టి పోస్తేనే పడిపోయిందని అధికారులు చెబుతున్నారు. వరద ప్రవాహానికి ఉధృతకు వైరా నది ప్రవహించే వరద తాకిడికి మిగతా పిల్లర్లు తట్టుకుంటాయి. వరద ప్రవాహం నుండి ప్రమాదం జరగకుండా కాపాడతాయా ఒక్కసారి ఆలోచించాలి. క్వాలిటీ కంట్రోల్ అధికారులు పూర్తిగా కాంట్రాక్టర్ల కనుసైగల్లోను అధికారుల అడుగుజాడల్లనే నివేదికలు తయారు చేస్తున్నారనే వాదన కూడా వినపడుతుంది. బ్రిడ్జి పనులు నిర్మాణంలో క్వాలిటీని బయటపెట్టారు. అధికారులు క్వాలిటీని బయటపెట్టి ఉంటే బ్రిడ్జి నిర్మాణంలో పిల్లర్ కూలిపోయేది కాదు. లక్ష్మీ పురం వద్ద జరుగుతున్న బ్రిడ్జి నిర్మాణంలో ఉన్న పిల్లర్ కూలిపోవడానికి పూర్తిగా అధికారుల నిర్లక్ష్యమే అని పలువురు ఆరోపిస్తున్నారు. ఎందుకు అంటే అధికారుల పర్యవేక్షణ కచ్చితంగా ఉండి ఉంటే నిర్మాణంలోఉన్న పిల్లర్ కూలిపోదు. ఇప్పటికే బ్రిడ్జి నిర్మాణ పనుల పట్ల పెద్ద ఎత్తున విమర్శలు వినిపిస్తున్నాయి. ఎక్కడ నుంచో తోలవలసిన ఇసుకను తోలకుండా నామమాత్రంగా వైరా నదిలో ఇసుకనే వాడారు అనే ఆరోపణలు సైతం వినిపిస్తున్నాయి. మంచిగా ఉండే ఇసుకని కొంతవరకు కనిపించే విధంగా డంపింగ్ చేసి ఉంచుతున్నారు. ఆరోపణలు గ్రామం నుంచి వినిపిస్తున్నాయి. అసలు అధికారులు ఎందుకు పనుల విషయంలో నిర్లక్ష్యానికి చూపెడుతున్నారు. బ్రిడ్జి నిర్మాణానికి ముందే పిల్లర్ కూలిపోవడం అంటే ఎంత నాణ్యత ఉందో ఒక్కకసారి అధికారులు బహిర్గతం చేయాల్సిన అవసరం ఉంది. బ్రిడ్జి నిర్మాణానికి ప్రభు త్వం ఇచ్చిన వర్క్ ఆర్డర్‌లో ఉన్న నిబంధనలు ఏమిటి, ఆ నిబంధనలో వాడాల్సిన సువ్వ ఏమిటి, ఇసుక ఎక్కడి నుంచి వాడాలి సిమెంటు ఏ విధంగా వాడాలి, కంకర ఏ సైజు వాడాలి అనేది కూడా స్పష్టంగా వర్క్ ఆర్డర్‌లో ఉంటుంది. కాని వర్క్ ఆర్డర్‌ను విస్మరించి బ్రిడ్జి నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని ఆరోపణలు కూడా లేకపోలేదు. సాక్షాత్తు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క ఎంతో ప్రతిష్టాత్మకంగా ఈ ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేయాలని ఉద్దేశ్యంతో ప్రజల రవాణాకు ఇబ్బంది కలగకూడదని మహాశివరాత్రి వేళ భక్తులకి అంతరాయం కలగకూడదని రూ.5కోట్లతో బ్రిడ్జి నిర్మాణాన్ని నిధులు మంజూరు చేశారు. పలుసార్లు స్వగ్రామానికి వచ్చిన ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క నిత్యం అధికారులను క్వాలిటీ విషయంలో పదేపదే హెచ్చరిస్తూ వచ్చారు. స్థానిక శాసనసభ్యులు రాందాస్‌నాయక్ అధికారులతో సమీక్ష చేసినప్పుడు కూడా పనులు నాణ్యతతో జరగాలి ఎక్కడ కూడా ఇబ్బంది కలగకూడదు. నాణ్యత లోపం వస్తే సహించేదే లేదని హెచ్చరించిన సందర్భాలు ఉన్నాయి. కాని వారి మాటలు అధికారులకు ఏమి పట్టనట్టు కాంట్రాక్టర్లకు మట్టాలుగా వ్యవహరిస్తున్నారు. తప్పు జరిగితే పరిశీలించి తప్పు జరిగింది ఎందుకు ఏమిటి? ఏ విధంగా జరిగిందని నివేదిక చేయాల్సిన బాధ్యత యుద్ధం కలిగిన జిల్లా అధికారులు కూడా నోటి నుంచి తప్పుడు మాటలు వస్తున్నాయి అంటే ఒక్కసారి ఆలోచించాలి. మట్టి పోస్తేనే బ్రిడ్జి పిల్లర్ పడిపోతుదా అలాంటప్పుడు మిగతా పిల్లర్లలో కూడా నాణ్యత ఉంటదా ఒక్కసారి ఆలోచించాలి. ఇప్పటికైనా నాణ్యత లోపం జరగడానికి కారణం ఏమిటి దానికి బాధ్యు లు ఎవరు కనిపెట్టి పూర్తిస్థాయిలో వారి మీద చర్యలు తీసుకొని నాణ్యతతో బ్రిడ్జి నిర్మాణం కొనసాగించాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

## రేపు సిపిఐ జిల్లా కార్యవర్గ సమావేశం

ప్రజాపక్షం/ఖమ్మం : భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) జిల్లా కార్యవర్గ సమావేశం ఉదయం 11 గంటలకు గిరిప్రసాద్ భవన్‌లో జరుగుతుందని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ నేడొక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మహ్మద్ మౌలానా లు హాజరవుతారని ఆయన తెలిపారు. పంచాయతీ ఎన్నికల ఎజెండాగా సమావేశం నిర్వహించనున్నట్లు సురేష్ తెలిపారు.

# పంచాయతీ పోరు..!

(మొదటిపేజీ తరువాయి)

జరగనున్నాయి. మొదటి విడతకు ఈనెల 27 నుండి రెండవ విడతకు ఈనెల 30 నుండి మూడవ విడతకు డిసెంబర్ మూడు నుండి నామినేషన్లను స్వీకరించనున్నారు. మొదటి విడత నామినేషన్లను ఈ నెల 27 నుండి 29 వరకు స్వీకరిస్తారు. 30న నామినేషన్ల పరిశీలన, ఒకటవ తేదీన అప్పీల్స్, రెండవ తేదీన జాబితా ప్రకటన, మూడవ తేదీన ఉప సంహరణ అదే రోజున అభ్యర్థుల జాబితాను ప్రకటించనున్నారు. మొదటి విడతకు 11వ తేదీ ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం ఒకటి వరకు పోలింగ్ నిర్వహిస్తారు. అదే రోజున మధ్యాహ్నం రెండు గంటల నుంచి లెక్కింపు ప్రారంభమవుతుంది. రెండవ విడతకు సంబంధించి నవంబర్ 30వ తేదీ నుండి డిసెంబర్ రెండవ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ, మూడున పరిశీలన, ఆరవ తేదీన ఉప సంహరణలు, 14వ తేదీన ఉదయం ఏడు గంటల నుంచి పోలింగ్ అదే రోజు మధ్యాహ్నం రెండు గంటల నుంచి లెక్కింపు జరుగుతుంది. మూడవ విడతకు సంబంధించి డిసెంబర్ మూడవ తేదీ నుంచి ఐదవ తేదీ వరకు నామినేషన్లను స్వీకరిస్తారు. ఆరున పరిశీలన, తొమ్మిదిన ఉప సంహరణ, 17న ఎన్నికలను నిర్వహిస్తారు. అదే రోజున ఓట్ల లెక్కింపు జరుగుతుంది. ఖమ్మం జిల్లాలో మొదటి విడతలో కొణిజర్ల, రఘునాథపాలెం, వైరా, బోనకల్, చింతకాని, మధిర, ఎర్రుపాలెం మండలాలు మొత్తం 192 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరగనున్నాయి. రెండవ విడతలో కామేపల్లి, ఖమ్మం రూరల్, కూసుమంచి, ముదిగొండ, నేలకొండపల్లి, తిరుమలాయపాలెం మండలాల పరిధిలోని 183 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరగనున్నాయి. మూడవ విడతలో ఏన్కూరు, కల్లూరు, పెనుబల్లి, సత్తుపల్లి, తల్లాడ, వేంసూరు, సింగరేణి మండలాల పరిధిలోని 196 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరగనున్నాయి. రాజకీయ పార్టీలు అభ్యర్థుల ఎంపికలో నిమగ్నమయ్యాయి.

## అభ్యుదయ విప్లవ రచనలకు ఆహ్వానం

ప్రజాపక్షం/ఖమ్మం : భారత కమ్యూనిస్టు పార్టీ శతాబ్ది ఉత్సవాల ముగింపు సందర్భంగా భారత కమ్యూనిస్టు పార్టీ చరిత్రను, పోరాటాలను, అమరుల త్యాగాలను నేటి తరానికి తెలియజేప్పే క్రమంలో బహుముఖ కార్యక్రమాలను నిర్వహిస్తుంది. ఈ క్రమంలో విప్లవ రచనలు, పాటల ద్వారా నేటి తరాలకు తెలియజేయాలనే సంకల్పంతో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించే క్రమంలో కవులు, కళాకారులతో ఒక కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ ఆధ్వర్యంలో డిసెంబర్ 10న ఖమ్మంలో కవి సమ్మేళనం నిర్వహించనుండగా ఆ సమ్మేళనానికి ప్రముఖ సినీ గేయ రచయిత సుద్దాల అశోక్ తేజ హాజరవుతున్నట్లు కమిటీ కన్వీనర్, ప్రముఖ కవి లెనిన్ శ్రీనివాస్ తెలిపారు. ఈ కమిటీలో కవులు రౌతు రవి, కొంపల్లి రామయ్య, గోపిశెట్టి వెంకటేశ్వర్‌రావు ఉన్నట్లు లెనిన్ శ్రీనివాస్ తెలిపారు. శతాబ్ది ఉత్సవాల సందర్భంగా ప్రత్యేక సావనీర్ విడుదలవుతుందని ఈ సావనీర్‌కు కమ్యూనిస్టు పార్టీ ఉద్యమ చరిత్ర, ఖమ్మంజిల్లా సంస్కృతి, సాంప్రదాయాలు, పోరాటాలు, కళలు, ప్రజల జీవన విధానంపై అభ్యుదయ రచనలు, పాటలను కోరుతున్నట్లు లెనిన్ శ్రీనివాస్ తెలిపారు. ఆసక్తి గల కవులు తమ రచనలను లెనిన్ శ్రీనివాస్ 9959852154కు పంపాలని లెనిన్ శ్రీనివాస్ కోరారు.

### భూ విజ్ఞాన శాస్త్ర పరిశోధనలో

# ముందడుగు ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ

(మొదటిపేజీ తరువాయి)

ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. నియోజకవర్గం ఏర్పాటు కొత్తగూడెం జిల్లాకు, నియోజకవర్గానికి దక్కిన అరుదైన గౌరవం అన్నారు. ఉమ్మడి జిల్లాలో తొలి యూనివర్సిటీ ఏర్పాటుకు గర్వపడుతున్నట్లు చెప్పారు. ఇక్కడ భవిష్యత్ తరాలకు చక్కని జ్ఞానాన్ని అందించే వేదిక అవుతుందని తెలిపారు. ప్రపంచ స్థాయి మేధావులను త్వరలో ఈ భూ విజ్ఞాన కేంద్రం అందించనుందని, తద్వారా కొత్తగూడెం నియోజకవర్గం పేరు ప్రపంచ పటంలో నిలుస్తుందన్నారు. ఎర్త్ సైన్సెస్ కోర్సులతో మన యువతకు బొగ్గు, ఖనిజం, ఇంధన రంగాల్లో అపారమైన ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని, ప్రత్యక్షంగా పరోక్షంగా వేలాది మందికి ఉపాధి అవకాశాలు దక్కుతాయని చెప్పారు. యూనివర్సిటీ ఏర్పాటుకు సహకరించిన రాష్ట్ర ముఖ్యమంత్రి, మంత్రులకు కూనంనేని కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌ఏ వెంట సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా, చుంచుపల్లి మండల కార్యదర్శి వాసిరెడ్డి మురళి, మున్సిపల్ కమీషనర్ సుజాత, గ్రంధాల చైర్మన్ వీరబాబు, టిపిసిసి కార్యదర్శి నాగసీతారాములు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : జిల్లాలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా॥ పి. శ్రీజ తెలిపారు. కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో అదనపు కలెక్టర్ డా॥ పి. శ్రీజ స్థానిక సంస్థల ఎన్నికల నోడల్ అధికారులతో మంగళవారం ఎన్నికల నిర్వహణపై సమీక్షించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు కేటాయించిన విధులు సమర్థవంతంగా నిర్వర్తించాలన్నారు. ఈ సమావేశంలో డిఆర్‌వో ఎ. పద్మశ్రీ, డిఆర్డివో సన్యాసయ్య, డిపివో ఆశాలత, ఎంపిఐ వెంకటరమణ, సిపివో ఎ. శ్రీనివాస్, ఉపాధి కల్పనాధికారి శ్రీరామ్, డివైఎస్‌వో సునీల్ రెడ్డి, డిసివో గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళలు ఆర్థికంగా బలోపేతం చేసేందుకు పటిష్ట చర్యలు

**- జిల్లా కలెక్టర్ అనుదీప్**

**4782 మహిళా సంఘాలకు**

**4.99 కోట్ల వడ్డీలేని రుణ సొమ్ము జమ**



**ప్రజాపక్షం/ మధిర :** మహిళల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత కల్పిస్తూ వారిని ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకుందని జిల్లా కలెక్టర్ దురిశెట్టి అనుదీప్ తెలిపారు. మధిర పట్టణం దెందుకూరు రోడ్డులోని శ్రీరస్తు ఫంక్షన్ హాల్ నందు మంగళవారం నిర్వహించిన మధిర అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో మహిళా స్వయం సహాయక సంఘాలకు వడ్డీలేని రుణాలు పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మధిర నియోజకవర్గం సంబంధించి 4782 మహిళా సంఘాలకు రూ.4.99 కోట్లు వడ్డీలేని రుణాల సొమ్ము పంపిణీ చేయడం జరిందీ. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మహిళలు ప్రాధాన్యతగా ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నదని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో మహిళలకు ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమం ఇందిరాగాంధీ జయంతినాడు ప్రారంభించి 4రోజుల్లో దాదాపు 4లక్షల చీరల పంపిణీ పూర్తి చేశామని అన్నారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క ఆదేశాల మేరకు ఖమ్మం జిల్లాలో ఇప్పటి వరకు రూ.60కోట్లు మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణ పథకం కింద పంపిణీ చేశామని అన్నారు. నేడు జిల్లా వ్యాప్తంగా 19,670 ఎస్‌హెచ్‌జిలకు రూ.19.27కోట్ల వడ్డీలేని రుణాలు పంపిణీకి ఏర్పాటు చేశామని తెలిపారు. మధిర నియోజకవర్గ పరిధిలో ఇందిరా మహిళా డెయిరీ ప్రత్యేకంగా ఏర్పాటు చేసి ఇప్పటి వరకు 250పాడి పశువులకు పంపిణీ చేశామని అన్నారు. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు పటిష్ట చర్యలు ప్రభుత్వం తీసుకున్నట్లు, రాష్ట్రానికి ఆదర్శంగా మధిర నియోజకవర్గ మహిళలు ఎదగాలని సూచించారు. అనంతరం మధిర నియోజకవర్గంలోని మహిళలకు ఇందిరమ్మ మహిళా శక్తి చీరలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పిసిఇఓ దీక్షారైనా, డిఆర్‌డిఓ సన్యాసయ్య, ఖమ్మం ఆర్‌డిఓ నర్సింహారావు, మధిర మండల తహశీల్దార్ రాంబాబు, మధిర మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నర్సింహారావు, ఆత్మ కమిటీ చైర్మన్ కర్నాటి కోటేశ్వరరావు, ఐలూరి వెంకటేశ్వరరెడ్డి, సుధాకర్, చావా రామకృష్ణ, మండల కాంగ్రెస్ అధ్యక్షులు సూరంశెట్టి కిషోర్, రామ కోటేశ్వరరావు, మండల సమాఖ్య సభ్యులు, మహిళలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# మహిళా సంక్షేమానికి అధిక ప్రాధాన్యత

**-వడ్డీ లేని రుణాలు పంపిణీ కార్యక్రమంలో మేయర్**






**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలోని ప్రజా ప్రభుత్వం మహిళా సంక్షేమానికి అధిక ప్రాధాన్యత కల్పిస్తుందని ఖమ్మం నగర మేయర్ పునుకొల్లు నీరజ తెలిపారు. రఘునాథపాలెం రైతు వేదికలో మంగళవారం నిర్వహించిన ఖమ్మం అసెంబ్లీ నియోజక వర్గం వడ్డీ లేని రుణాల పంపిణీ కార్యక్రమంలో మేయర్ పునుకొల్లు నీరజ పాల్గొన్నారు. ఖమ్మం నియోజక వర్గానికి సంబంధించి 996 మహిళా సంఘాలకు రూ. 99.95 లక్షల వడ్డీ లేని రుణాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ. 500లకే గ్యాస్ సిలెండర్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రేషన్ కార్డు ద్వారా సన్న బియ్యం సరఫరా, ఇందిరమ్మ ఇండ్లు వంటి అనేక కార్యక్రమాలను అమలు చేస్తుందన్నారు. ఉచిత బస్సు ప్రయాణం వల్ల, సన్న బియ్యం పంపిణీ వల్ల మహిళలకు నెలకు ఎంతో కొంత మిగులుతున్నాయన్నారు. మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలను మంజూరు చేస్తుందని వాటిని సద్వినియోగం చేసుకుని మహిళలు తమ వ్యాపారాలను అభివృద్ధి చేసుకోవాలన్నారు. చిన్న చిన్న వ్యాపారాలను ప్రారంభించి గొప్ప స్థాయికి చేరుకోవాలన్నారు. రఘునాథపాలెం మండలానికి సాగునీటిని అందించేందుకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కృషి చేస్తున్నారన్నారు. రఘునాథపాలెంలో యంగ్ ఇండియా స్కూల్, స్వామినారాయణ విద్యా సంస్థలు, మెడికల్ కళాశాల సైతం ఏర్పాటవుతున్నాయన్నారు. పిల్లలను మంచిగా చదివించి ఉన్నతవంతులను చేయాలన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి ఎ. పద్మశ్రీ మాట్లాడుతూ ఖమ్మం నియోజక వర్గానికి సంబంధించి 1390 ఎస్‌హెచ్‌జిలకు గాను 996 సంఘాలకు రూ.99.95 లక్షలు వడ్డీ లేని రుణాలను అందిస్తున్నట్లు తెలిపారు. వచ్చిన డబ్బులను గ్రూప్ సభ్యులంతా ఆలోచన చేసి వాటిని సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఛైర్మన్ యరగర్ల హన్మంతరావు, శిక్షణ డిప్యూటీ కలెక్టర్ ఎం. అపూర్వ, మండల ప్రత్యేకాధికారి ముజాహీద్, కార్పొరేటర్లు నీరజ, లక్ష్మి, వైష్ణవి, తహసీల్దార్ శ్వేత, ఎంపిడివో అశోక్ కుమార్, ఏపిఎం జ్యోతి, మండల సమాఖ్య బాధ్యులు శ్రీలక్ష్మి , ఉపేంద్రమ్మ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలల పరిశీలన



**ప్రజాపక్షం/ ఎర్రుపాలెం :** మండలంలోని ప్రభుత్వ పాఠశాలలను మండల ప్రత్యేక అధికారి విజయచంద్ర మంగళవారం సందర్శించారు. తెల్లపాలెం పాఠశాలను సందర్శించి విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. ఖమ్మం జిల్లా కలెక్టర్ దురిశెట్టి అనుదీప్ విద్యార్థుల కోసం ప్రత్యేకంగా రూపొందించిన ఇసిఆర్ కార్యక్రమం ఏ విధంగా జరుగుతుందో ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం భోజనశాలను సందర్శించి స్టాక్ రిజిస్టర్‌ను తనిఖీ చేశారు. అన్ని ఆహార పదార్థాలు స్టాక్ ఖచ్చితంగా ఉండాలని, స్టాకు రిజిస్టర్‌ను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి బి.మురళీమోహన్‌రావు, ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

## నాణ్యమైన న్యాయ సేవలు అందించటమే లక్ష్యం



**ప్రజాపక్షం/మధిర :** న్యాయ వ్యవస్థన ప్రజలకు మరింత చేరువ చేసేందుకు అవసరమైన మౌలిక మార్పులు అవగాహన పరిస్థితులను నెలకొల్పి ప్రజలకు నాణ్యమైన న్యాయ సేవలు అందించటమే లక్ష్యమని జిల్లా 6వ అదనపు న్యాయమూర్తి మారగాని శ్రీనివాస్ అన్నారు. శాఖపరమైన తనిఖీల్లో భాగంగా మంగళవారం మధిర కోర్టును సందర్శించి రికార్డులు, పెండింగ్ కేసులు స్థితి, రోజువారీ విచారణ ప్రక్రియ కోర్టు పరిపాలన, కక్షిదారులకు అందిస్తున్న సేవలు తదితర అంశాలను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కోర్టులకు వచ్చే ప్రతి కక్షిదారునికి సమయానికి న్యాయం అందించేందుకు సిబ్బంది, అధికారులు తమ బాధ్యతలను నిజాయితీగా నిర్వర్తించాలని సూచించారు. రెండు కోర్టుల సిబ్బందిని సమన్వయం చేసుకుంటూ పని చేయడం ద్వారా మంచి ఫలితాలు సాధిస్తున్న స్థానిక న్యాయమూర్తి దీప్తి వేములను అభినందించారు. అంతేకాకుండా ప్రతిఒక్కరూ జవాబుదారీతనంలో పనిచేస్తే న్యాయ వ్యవస్థపై ప్రజల విశ్వాసం మరింత బలపడతుందని, కేసుల పెండెన్సీ తగ్గించడానికి వేగవంతమైన విచారణలు, పారదర్శక విధానం అత్యంత కీలకమని పేర్కొన్నారు. ప్రజలకు సహాయకంగా ఉండే విధంగా కోర్టు సిబ్బంది మరింత శ్రద్ధ చూపించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కోర్టు సూపరిండెంట్ తోట వెంకన్న, మల్లేశ్వరరావు, సురేంద్రమణి, సుజాత, దివి, వినయ్, ఉపేందర్, పవన్ కళ్యాణ్, శ్రావణి, వందన, నాగమణి, న్యాయవాదులు, సిబ్బంది, పరిపాలనా అధికారులు పాల్గొన్నారు.

# క్లెయిమ్ చేసుకోని ఆస్తుల కోసం ప్రత్యేక కార్యక్రమం

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** కేంద్ర ప్రభుత్వం ఆర్థిక మంత్రిత్వ శాఖ పరిధిలోని ఆర్థిక సేవల విభాగం ఆదేశాలకు అనుగుణంగా మీ డబ్బు మీ హక్కు అనే ఇతివృత్తంతో క్లెయిమ్ చేసుకుని ఆర్థిక పరమైన ఆస్తుల సమస్యను పరిష్కరించేందుకు మూడు నెలల కార్యక్రమం చేపట్టిందని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అక్టోబర్ నాలుగున గుజరాత్‌లోని గాంధీనగర్‌లో జాతీయ స్థాయి కార్యక్రమాన్ని ప్రారంభించారని ఇట్టి కార్యక్రమం అక్టోబర్ ఒకటి నుంచి డిసెంబర్ 31 వరకు మూడు నెలల పాటు కొనసాగుతుందన్నారు. క్లెయిమ్ చేసుకుని బ్యాంకు పొదుపులు, షేర్లు, డివిడెండ్లు, మ్యూచువల్ ఫండ్స్, బీమా తదితరాలను క్లెయిమ్ చేసుకునేందుకు వీలు కల్పించాలన్న లక్ష్యంతో దీనిని చేపట్టారని కలెక్టర్ తెలిపారు. జాతీయ ప్రాముఖ్యత కలిగిన ఈ కార్యక్రమం ఆర్థిక పరమైన ఆస్తులను ప్రజలు సరైన పద్ధతిలో క్లెయిమ్ చేసుకునేలా చూసుకోవాలన్న ప్రభుత్వ నిబద్ధతను అనుగుణంగా ఉందని తెలిపారు. ఇందులో భాగంగా ఎంసిఏ, ఆర్‌బిఐ, సెబీ, ఐఆర్‌డిఏఐ, పిఎఫ్‌ఆర్డిఏ బ్యాంకులు ఉమ్మడి శిబిరాలను నిర్వహిస్తాయని కలెక్టర్ తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రారంభమైన ఈ కార్యక్రమంలో దశల వారీగా జిల్లా స్థాయి శిబిరాలను నిర్వహిస్తున్నారన్నారు. ఈ నెల 28న (శుక్రవారం) ఖమ్మం కలెక్టరేట్ కార్యాలయం ఆడిటోరియంలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు ఉమ్మడి శిబిరం నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. క్లెయిమ్ చేసుకుని ఆర్థికపరమైన ఆస్తుల వాస్తవ యజమానులు వాటిని పొందెందుకు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. బ్యాంకుల్లో పదేళ్లకు పైగా క్లెయిమ్ చేసుకుని డిపాజిట్ల వివరాలు ఆర్‌బిఐ ఉద్గమ్ వెబ్‌సైట్ ద్వారా పొందవచ్చునని, ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు.

## మండలంలో మొత్తం ఓటర్లు 59.771 ఓట్లు




**ప్రజాపక్షం/తిరుమలాయపాలెం :** తెలంగాణ రాష్ట్రంలో ఎట్టకేలకు గ్రామపంచాయతీ ఎన్నికలు నిర్వహణపై ప్రభుత్వం సానుకూలంగా ఉండడంతో ఇటీవల గ్రామపంచాయతీల వార్డుల రిజర్వేషన్ ఖరారు చేస్తూ జిల్లా కలెక్టర్ జిల్లా వారీగా మండలాల వారీగా గ్రామాల వారీగా వార్డులు పంచాయతీ సర్పంచ్‌లు రిజర్వేషన్ ఖరారు చేస్తూ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయడంతో గ్రామపంచాయతీ ఎన్నికల కసరత్తు మొదలైంది. తిరుమలాయపాలెం మండలంలో మొత్తం 40 గ్రామపంచాయతీలు ఉండగా మొత్తం ఓటర్లు 59,771 ఓటర్లు ఉండగా దీనిలో పురుషులు 24,557 ఓటర్లు మహిళల ఓటర్లు 26,213 ఓటర్లు ఉన్నారు. ఇతరులు ఒక ఓటు మండలం మొత్తంలో 1656 మహిళలు ఎక్కువ ఓటర్లు కలిగి ఉన్నారు. పురుషుల ఓటర్ల కంటే మహిళా ఓటర్ల అధికం కాగా 40 గ్రామపంచాయతీల పరిధిలో మొత్తం 356 బూతులు పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని మండల అభివృద్ధి అధికారి ఎస్కే సిలార్‌సాహెబ్ తెలిపారు. నోటిఫికేషన్ ఎప్పుడు రిలీజ్ అయిన ఎన్నికలు సజావుగా జరిగిందేందుకు అన్ని చర్యలు చేపట్టామని ఎన్నికలు ఎప్పుడూ వచ్చినా సర్వం సిద్ధమని ఆయన తెలిపారు. మంగళవారం బ్యాలెట్ భద్ర పరిచినట్లు ఆయన తెలిపారు.

## స్నానాల లక్ష్మీపురం సర్పంచ్ అభ్యర్థి బరిలో మల్లు రామకృష్ణ?



**ప్రజాపక్షం/వైరా:** వైరా మండల స్నానాల లక్ష్మీ పురం గ్రామానికి త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేసేందుకు కాంగ్రెస్ యువ నాయకుడు మల్లు భట్టివిక్రమార్క, నందిని దంపతుల మాటే శాసనంగా భావించే మాజీ ఉప సర్పంచ్ మల్లు రామకృష్ణ సిద్ధంగా ఉన్నారు. స్థానిక ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ ఆధ్వర్యంలో, నూతి సత్యనారాయణ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, కాంగ్రెస్ పార్టీ నుంచి అవకాశం ఇస్తే పోటీ చేస్తానని, రాజకీయాల్లో కాంగ్రెస్‌లోనే ఉంటూ ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క అనుచరుడిగా గ్రామంలో ప్రజలకు అందుబాటులో ఉంటూ ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ సహకారంతో పనులు పరిష్కారం చేసేందుకు కృషి చేస్తున్నానని, ప్రజలు కాంగ్రెస్ పెద్దలు అవకాశం ఇస్తే కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీకి సిద్ధమంటన్న మల్లు రామకృష్ణ.

## ఇందిరమ్మ చీరలు పంపిణీ



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** ఇందిరా మహిళా శక్తి పథకంలో భాగంగా మహిళలకు ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు. మంగళవారం మండల పరిధిలోని కోయచలక గ్రామంలో జరిగిన కార్యక్రమంలో ఏఎంసి ఛైర్మన్ యరగర్ల హన్మంతరావు, మాజీ ఉప సర్పంచ్ చెరుకూరి పూర్ణచందర్‌రావు మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఇంటింటికి వెళ్లి మహిళలకు బొట్టుపెట్టి చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏఎంసి ఛైర్మన్ మాట్లాడుతూ మహిళా సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం పలు పథకాలను అమలు చేస్తుందన్నారు. ఉచిత బస్సు ప్రయాణం, రాయితీపై గ్యాస్ పంపిణీ, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, మహిళ సంఘాల ద్వారా సోలార్ ప్లాంట్ల ఏర్పాటు, ఆర్టిసికి అద్దె బస్సులు, వడ్డీ లేని రుణాలను అందిస్తుందని వాటిని సద్వినియోగం చేసుకుని మహిళలు ఆర్థికంగా ఎదగాలని కోరారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజ్యలక్ష్మి , జిపివో రాజారత్నం, ఏఎంసి డైరెక్టర్ చెరుకూరి సీతారాములు, మాధంశెట్టి హన్మంతరావు, మాధంశెట్టి సీతారాములు, అమరం అప్పారావు, చెరుకూరి కృష్ణారావు, బలుసుపాటి శేషయ్య, ఇందిరమ్మ కమిటీ సభ్యులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## బీటీ రోడ్లకు శంకుస్థాపన



**ప్రజాపక్షం/అశ్వాపురం:** ప్రజల సమస్యలను అర్థం చేసుకుని పరిష్కరించమడే ఇందిరమ్మ ప్రభుత్వ సంకల్పమని, ఎన్నో సంవత్సరాలుగా రవాణా కొరత, కష్టసాధ్యమైన మార్గాల కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న అశ్వాపురం మండలంలోని గొందిగూడెం, కొత్తూరు, గుండ్లమడుగు గ్రామాలకు రాష్ట్ర ప్రభుత్వం శాశ్వత ఉపశమనం కలిగించిందని ఎంఎల్ఏ పాయం వెంకటేశ్వర్లు అన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సౌకర్యాల కోసం ప్రభుత్వం ఎంత నిధులైనా వెచ్చించేందుకు సిద్ధంగా ఉందని తెలిపారు. మారుమూల పల్లెలకైనా బీటీ, సీసీ రోడ్లు అందించడంలో ఇందిరమ్మ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. అశ్వాపురం మండలం గొందిగూడెం కొత్తూరు నుండి గుండ్లమడుగు వరకు 80లక్షల రూపాయల వ్యయంతో నిర్మించనున్న బీటీ రహదారి పనులకు ఎంఎల్ఏ పాయం మంగళవారం భూమి పూజ చేశారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ మనిధర్, ఎంపీడీవో ముత్యాలరావు, ఎంఈవో వీరస్వామి, ఐటీడీఏ ఏఈ ప్రసాద్, సీఐ అశోక్‌రెడ్డి, గ్రామ పంచాయితీ సెక్రెటరీలు, ప్రభుత్వ అధికారులు, అశ్వాపురం మండల అధ్యక్షులు ఓరుగంటి బిక్షమయ్య, తుక్కాని మధుసూదన్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఓరుగంటి రమేష్ బాబు, భూరెడ్డి వెంకటరెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎన్నికలకు రిటర్నింగ్ అధికారులపాత్రే కీలకం



**ప్రజాపక్షం/కారేపల్లి:** పంచాయితీ ఎన్నికలను సమర్ధంగా నిర్వహించడంలో రిటర్నింగ్ అధికారులు కీలకపాత్ర పోషిస్తారని కారేపల్లి మండల ఎంపీడీవో శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో గల ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో రిటర్నింగ్ అధికారులకు మాస్టర్ ట్రెనింగ్ రాజేశ్ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రిటర్నింగ్ అధికారులకు సహాయ రిటర్నింగ్ అధికారులు సహకరిస్తుంటారని, మండలంలో 13 క్లస్టర్లకు గాను 13 మంది రిటర్నింగ్ అధికారులు నామినేషన్ల ప్రక్రియ, 41 గ్రామ పంచాయితీలకు 41 మంది సహాయ రిటర్నింగ్ అధికారులు ఎన్నికల ప్రక్రియను నిర్వహిస్తారని తెలిపారు. కాబట్టి వీరికి ఎన్నికల నిర్వహణపై శిక్షణ ఇవ్వాలని ఎన్నికల సంఘం నిర్ణయిందని తెలిపారు. ఈ శిక్షణలో భాగంగా పంచాయితీ ఎన్నిక నిర్వహణకు సంబంధించిన నియమనిబంధనలపై పూర్తి స్థాయిలో మాస్టర్ ట్రైనీలు అవగాహన కల్పించడం జరిగిందన్నారు. సింగరేణి మండలంలో 45,411 మంది ఓటర్లు ఉండగా 356 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. మూడో విడతలో మండలంలో ఎన్నికలు ఉండవచ్చని నోటిఫికేషన్ విడుదలైన తర్వాత సమగ్ర వివరాలతో కూడిన సామగ్రిని రిటర్నింగ్ అధికారులకు అదంజేస్తామని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ రమేష్, ఎంఈఓ జయరాజ్, ఎంపీఓ మల్లెల రవీంద్ర ప్రసాద్, ఎంపీడీవో కార్యాలయం సూపరింటెండెంట్ రమేష్ పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించాలి



**ప్రజాపక్షం/జూలూరుపాడు:** పాపకొల్లు గ్రామంలో ఎఫ్సీఐ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి యాసా రోశయ్య పాపకొల్లు రైతు వేదికలో మంగళవారం ఏఈఓకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా యాస రోశయ్య మాట్లాడుతూ కొత్తూరు, పాపకొల్లు, బోజ్య తండా మూడు గ్రామ పంచాయతీల రైతులకి దగ్గర్లో ఉన్నటువంటి పాపకొల్లు రైతు వేదికలో ఎఫ్సీఐ కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేస్తే పాపకొల్లు పరిసర ప్రాంత రైతాంగానికి ఉపయోగపడుతుందని తక్షణమే అధికారులు పర్యవేక్షణ చేసి కొనుగోలు కేంద్రం ఏర్పాటుకు సహకరించాలని, కొనుగోలు కేంద్రం ఇక్కడ లేకపోవడం వల్ల రైతులు ఇబ్బంది పడుతున్నారని, అధికారులు స్పందించి కొనుగోలు కేంద్రం ఏర్పాటుకు సహకరించాలని లేని పక్షంలో రైతుల పక్షాన ఆందోళన కార్యక్రమం నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అప్పికట్ల పుల్లయ్య, భూక్య అమృ అప్పికట్ల ప్రసాద్, ఊడల సుధా తదితరులు వినతి పత్రం అందజేశారు.

## రామాలయంలో దేవత మూర్తుల విగ్రహాల ఆవిష్కరణ



**ప్రజాపక్షం/ఇల్లందు:** ఇల్లందు పట్టణంలోని ఎనిమిదో వార్డు నందుగల శ్రీ సీతారామ ఆలయంలో సీతారామ లక్ష్మణ హనుమాన్ విగ్రహాల ప్రతిష్టాపన, గణపతి, దుర్గ మాత, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, నందీశ్వర స్వామి విగ్రహాలను వేద పండితుల సమక్షంలో ప్రతిష్టించారు. ఈకార్యక్రమాన్ని పురస్కరించుకొని ఇల్లందు మాజీ మున్సిపల్ ఛైర్మన్ మడతరమా వెంకట్‌గౌడ్ ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమాన్ని ఎంఎల్ఏ కోరం కనకయ్య సతీమణి లక్ష్మీ, డిఎస్పి చంద్రభాను దంపతులు, మడతరమ వెంకట్ గౌడ్ దంపతులు అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ అన్నదానంలో ఇల్లందు మండలం, పట్టణంలోని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈకార్యక్రమంలో ఏక్తా హౌస్ టీం సభ్యులు మామిడి శివ, కోటగిరి రాజు, మెరుగు భరత్, కంది సదానందం, మునాఫ్, రేఖ రవిశంకర్, స్వామి నాయక్, విక్కీ, గోపి, తదితరులు పాల్గొన్నారు.

# ఇల్లొంచ్చింది.. బిల్లు రాలే..!

**-బిల్లు చెల్లింపులో నిరుపేదలకు అన్యాయం**
**-బిల్లు చెల్లింపులో చేతులెత్తేసిన అధికారులు**
**-అయోమయంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు**





**ప్రజాపక్షం/జూలూరుపాడు:** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్మాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకం కొందరి తీరుతో అబాసు పాలవుతోంది. అధికారుల తప్పిదాలతో కొందరు లబ్ది దారులు తీవ్రంగా నష్టపోతున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండలం నల్లభండ బోడు గ్రామానికి చెందిన బచ్చల బుచ్చమ్మ, గడ్డం రేణుక ఉదాహరణగా చెప్పుకోవచ్చు.





### స్పెల్లింగ్ తప్పుబడ్డ కారణగా మంజూరు కాని బిల్లు..

జూలూరుపాడు మండలపరిధిలోని నల్లభండబోడు గ్రామానికి చెందిన బచ్చల బుచ్చమ్మ, గడ్డం రేణుక భర్త మల్లయ్య దంపతులకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తూ స్థానిక ఎమ్మెల్యే రాందాస్ నాయక్ మంజూరు పత్రాలను అంద జేశారు. దీంతో వారు పాత ఇల్లు కూల్చి అదే స్థానంలో నూతన ఇంటి బేస్మెంట్ వరకు పూర్తి చేశారు. అనంతరం అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి లబ్ధిదారుని పేరుతో బిల్లును విడుదల చేసే సమయానికి లబ్ది దారుల పేరులో స్పెల్లింగ్ మిస్టేక్ వల్ల బచ్చల బుచ్చమ్మ , గుడ్డం రేణుక బ్యాంకు ఖాతాలో రోజులు గడుస్తున్న డబ్బులు పడకపోవడంతో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు అధికారులను సంప్రదించడంతో అసలు విషయం బయటపడింది. నల్లబండబోడు గ్రామానికి చెందిన నిరుపేదల పేర్లు తప్పుపడడంతో బిల్లు మంజూరు కాలేదని అధికారులు తెలిపారు. దీంతో లబ్ధిదారులు కంగుతున్నారు.

- అయోమయంలో లబ్ధిదారులు..

ఇందిరమ్మ ఇల్లు వచ్చిన ఆనందంలో మూడు నెలలు కూడా కాకుండాపైగా లక్షలు అప్పు తెచ్చి ఇండ్ల నిర్మాణం చేపట్టిన లబ్దిదారులకు బిల్లు రాకపోవడంతో అయోమయంలో పడ్డారు. అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్న సకాలంలో చెల్లిస్తామంటూ తిప్పి పంపడమే జరుగుతోందని, రోజులు గడుస్తున్న తమ బిల్లులు రావటం లేదని ఆందోళన చెందుతు న్నారు. బిల్లుల చెల్లింపు విషయంలో నెలకొన్న అవకతవకలలో తప్పు ఎక్కడ జరిగిందనే ప్రశ్న సర్వత్రా వ్యక్తమవుతుంది. ప్రజా పాలన సమయంలో దరఖాస్తులు చేసుకుంటే స్థానిక ఎమ్మెల్యే చేతుల మీదుగా ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు అందజేశారు. ఇందిరమ్మ ఇల్లు మంజూరైన సంతోషంలో అప్పుచేసి బేస్మెంట్ వరకు నిర్మాణం చేపట్టాం బిల్లు మంజూరు కాకపోవడంతో ఏం చేయాలో పాలు పోక అయోమయంలో ఉన్నారు.

### వడ్డీకి తెచ్చి బేస్ మెంట్ వరకు నిర్మాణం చేపట్టాం : గడ్డం రేణుక

ఇందిరమ్మ ఇల్లు నిర్మించేందుకు రెండు లక్షల రూపాయలు బంధువుల వద్ద నుండి అప్పు చేసి బేస్మెంట్ వరకు నిర్మించాం. కానీ బిల్లు పడకపోవడంతో బేస్ మెంట్ మధ్యలో ఇంటి నిర్మాణం నిలిచి పోయింది. ఇల్లు పూర్తి చేసేందుకు ఆర్థిక స్తోమత లేక రెండు నెలలుగా ఇంటి నిర్మాణం నిలిచిపోయింది. అధికారులు మా గోడు పట్టించుకొని న్యాయం చేయాలి.

### బిల్లు మంజూరు చేస్తే ఇల్లు నిర్మించుకుంటాం : బచ్చల బుచ్చమ్మ

ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం చేసుకోమని మంజూరు పత్రం అందచేయగానే ఎంతో సంతోషంగా వున్న ఇంటిని తీసేసి అప్పులు చేసి ఇంటి నిర్మాణం చేపడితే బేస్మెంట్ పూర్తికాగానే పేరులో స్పెల్లింగ్ మిస్టేక్ పడ్డాయని అందుకే ఇంటి బిల్లులు మంజూరు కాలేదని అధికారులు తెలిపారు ఉన్న ఇంటిని కూల్చుకొని నూతన ఇంటి నిర్మాణం చేపడితే బిల్లు మంజూరు కాక ఇబ్బందులకు గురవుతున్నాం.

## జిఎంఆర్ కళాశాలకు భూమి కేటాయించేలా చర్యలు తీసుకోవాలి



**ప్రజాపక్షం/మణుగూరు:** మణుగూరు మండలంలో జిఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాలకు భూమి కేటాయింపునకు సంబంధించి తక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతూ మాజీ జెడ్పీటీసీ పాల్వంచ దుర్గ తహశీల్దార్ అద్దంకి నరేష్ కి మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఇటీవల రోజులుగా మణుగూరు మండల పరిధిలో ప్రభుత్వ భూములపై జరుగుతున్న భారీ అవకతవకలు, నకిలీ పత్రాల సృష్టి, అక్రమ విక్రయాలు ప్రజల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని ఆమె పేర్కొన్నారు. ప్రభుత్వ భూములను పంచాయతీ భూములుగా చూపుతూ నకిలీ సేల్ డీడ్లు, ఈస్టేట్ ఎంట్రీలు, పంచాయతీ సర్టిఫికెట్లు, సర్వే దస్త్రాలు తయారు చేసి దందా జరుగుతోందని ఆమె తీవ్రంగా ఖండించారు. ఈ వ్యవహారంలో కొంత మంది స్థానిక సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారా? లేక పరోక్షంగా సహకరిస్తున్నారా? అనే అనుమానాలు వెల్లువెత్తుతున్నాయని ఆమె తెలిపారు. ఈ అవకతవకల వల్ల ప్రభుత్వ ఆస్తులు నష్టపోవడంతో పాటు, గిరిజన గ్రామీణ యువత శ్రేయస్సు కోసం ఏర్పాటు చేయాల్సిన విద్యాసంస్థ స్థాపన కూడా ఆలస్యమవుతోందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ఐటీడీఏ పీవో బి. రాహుల్ కి భద్రాచలంకు సమర్పించిన విజ్ఞప్తిలో పలు చర్యలు వెంటనే తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# సింగరేణిలో సైబర్ సెక్యూరిటీ అవగాహన

**ప్రజాపక్షం/ఇల్లందు :** సింగరేణి సంస్థ ఇల్లందు ఏరియా జియం జి కృష్ణయ్య ఆదేశాలనుసారం యంవిటిసి, ఐటి మేనేజర్ ఆర్ సుధాకర్ ఆధ్వర్యంలో మంగళవారం యిసిఓఏ క్లబ్ నందు సైబర్ సెక్యూరిటీ అవగాహన సదస్సు కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా డి రామ స్వామి పాల్గొన్నారు. ఈకార్యక్రమంలో డిజియం(ఐటి)శ్రీనివాస్‌రావు, మేనేజర్(ఐటి)డియస్ నాన ఫర్నవేసే ద్వారా సైబర్ సెక్యూరిటీపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా అవగాహన కలిపించారు. ఈసందర్భంగా నిపుణులు సైబర భద్రతకు సంబంధించి ముఖ్య అంశాలైన ఆన్‌లైన్ ఫ్రాడ్స్ నివారణ, డేటా ప్రొటెక్షన్, ఇమెయిల్ ఫిషింగ్, ఆఫీస్ నెట్‌వర్క్ సేఫ్టీ, ఉద్యోగుల వ్యక్తిగత డిజిటల్ భద్రత వంటి అంశాలపై సమగ్ర సమాచారాన్ని అందించారు. అలాగే వారు మాట్లాడుతూ సైబర్ ముప్పులు పెరుగుతున్న ఈ కాలంలో ప్రతి ఉద్యోగి అప్రమత్తంగా ఉండి, కంపెనీ డేటా భద్రతలో పాత్ర వహించాలని సూచించారు. అలాగే సైబర్ సెక్యూరిటీపైన ప్రతిజ్ఞ చేయించారు.



ఈ కార్యక్రమంలో కేఓసిపి ఓ గోవిందరావు, ఏజియం(ఐఈడి)గిరిధర్ రావు, ఏరియా సేఫ్టీ ఆఫీసర్ జాకీర్ హుస్సేన్, ఏరియా ఇంజనీర్ నరసింహారాజు, డిజియం(సివిల్)రవి కుమార్, డిజియం(యఫ్అండ్ఏ)నగలక్ష్మీ, డిప్యూటీ పర్సనల్ మేనేజర్ బి శ్యాం ప్రసాద్, ఇతర అధికారులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

# జోరుగా అక్రమ మట్టి తోలకాలు..!

**-అడిగేవారు లేరు.. ఆపేవారు లేరు**
**- సీతారామ కెనాల్ మట్టి మాయం**
**- పచ్చని పంట పొలాలు ధ్వంసం**
**- పట్టించుకోని అధికారులు**





**ప్రజాపక్షం/పాల్వంచ :** పాల్వంచలో మట్టి మాఫియా చెలరేగిపోతున్నది. అడిగేవారూ ఉండరు ఆపేవారు లేరు. అన్న చందాన సాగిస్తున్నారు. అధికారులు అందుబాటులో లేని శని, ఆదివారాలే లక్ష్యంగా పెట్రేగిపోతున్నారు. మట్టి మాఫియా ఆగడాలు రోజు రోజుకూ పెచ్చు మీరుతున్నాయి. అనుమతులు ఉన్నాంటూ రాత్రి సమయంలో లక్షల విలువైన ప్రభుత్వ సంపదను దోపిడి చేస్తున్నారు. కళ్ళెదుటే జరుగుతున్నా అధికారులు పట్టించుకోరు. పగలు రాత్రి తేడా లేకుండా తోడేస్తున్నారు. భారీ యంత్రాల సాయంతో సీతారామ కెనాల్ మట్టిని తవ్వేస్తూ మాయం చేస్తున్నారు. వందల లారీల మట్టిని అక్రమంగా తోలకాలు చేస్తూ ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి కొడుతున్నారు. ఒక్కో టిప్పర్ రూ.6,000/ల నుండి 7 వేయిల వరకు విక్రయిస్తున్నారు. ప్రతీ రోజు లక్షలు వెనకేసుకొంటున్నారు. పచ్చని పొలాలను ద్వంసం చేస్తున్నారు. వాటి ఆనవాళ్ళు చెరిపేస్తున్నారు. పాల్వంచకు చెందిన కొందరు టిప్పర్, జేసిబి యాజమానులు కలిసి ములకలపల్లి మండలం సమీపంలోని సీతారామ ప్రాజెక్టు కెనాల్ మట్టిని రాత్రి సమయంలో భారీ యంత్రాల సహాయంతో టిప్పర్లతో పాల్వంచ పట్టణానికి మట్టిని తరలిస్తున్నారు. పచ్చటి పంట పొలాలను నాశనం చేస్తున్నారు. దమ్మపేట సెంటర్ నుండి పాత పాల్వంచకు వెళ్ళే దారిలో ఓ గుత్తేదారుకి చెందిన సిసి రోడ్‌కు ఆనుకొని ఉన్న సర్వే నెంబర్ 51, 72 లో సుమారు నాలుగు ఎకరాల పంట పొలంలో నెల రోజులుగా దాదాపు ఐదు అడుగుల లోతు నుండి మట్టిని నింపుతున్నారు. (ఈ పొలం దగ్గర నుండి చింతలచెరువు పంట కాలువ ఉన్నది) అనంతరం రెండు ట్రాక్టర్ డోజర్లతో పోసిన మట్టిని కనిపించకుండా చదును చేస్తున్నారు. కన్వర్షన్ తీసుకొన్నది రెండెకరాలకు మాత్రమే అని చదును చేసేది నాలుగు ఎకరాల్లో అంటూ పలు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఆర్థిక పలుకుబడితో తమ ఇష్టారీతిన నిభంధనలను పాతరేస్తున్నా అధికారులు అటు వైపు కన్నత్తి చూడరనే విమర్శలు వస్తున్నాయి. ఇకనైనా అధికారులు అక్రమ మట్టి దందాపై దృష్టి సారించి తగు చర్యలు తీసుకొని ప్రభుత్వ ఆదాయాన్ని కాపాడాలని కోరుచున్నారు. ఈ విషయంపై తహశీల్దార్ దారా ప్రసాద్‌ను వివరణ కోరగా మట్టి తోలకాలకు ఎవరికి ఎటువంటి అనుమతులు మా కార్యాలయం నుండి ఇవ్వలేదన్నారు. చదును చేస్తున్న భూమికి కన్వర్షన్ అనుమతులు ఉన్నాయని చెప్పారు.

# ఆ భవనం తొలగింపులో ఉదాసీనత

**-పరిహారం ఇచ్చినా జంకు ఎందుకు?**
**- శిథిలావస్థలో భవనం**
**-ప్రమాదం జరిగితే బాధ్యులెవరు?**









**ప్రజాపక్షం/ మధిర :** మధిర మున్సిపాల్టీ అధికారుల ఉదాసీనత వలన శిథిలావస్థకు చేరిన బిల్డింగ్ ఆకస్మాత్తుగా కూలి భారీ ప్రాణ నష్టం జరిగే అవకాశం ఉందని ప్రజలు పెద్ద ఎత్తున చర్చించుకుంటున్నారు. అయినా సంబంధిత అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారు. రైల్వే ట్రాక్ పక్కన ఉన్న శిథిలావస్థకు చేరిన బిల్డింగ్ ప్రమాదవశాత్తు కూలి ప్రాణ నష్టం జరిగితే ఎవరూ బాధ్యులవుతారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. మధిర మున్సిపాల్టీ పరిధిలోని రైల్వేగేటు పక్కన ఉన్న రాయల్ లాడ్జి బిల్డింగ్‌ను కూల్చివేసేందుకు అధికారులు జాప్యం చేస్తున్నారు. రైల్వే మూడవ లైన్ పనుల్లో భాగంగా రాయల్ లాడ్జి బిల్డింగ్‌లోని కొంత స్థలాన్ని తీసుకుని స్థలంతో పాటు శిథిలావస్థకు చేరిన బిల్డింగ్ కావటంతో రైల్వే అధికారులు స్థలానికి, బిల్డింగ్ మొత్తానికి సంబంధిత యజమానులకు నష్టపరిహారం అందించారు.అయినా సంబంధిత యజమానులు బిల్డింగ్ కూల్చివేయకపోవటంతో శిథిలావస్థకు చేరిన బిల్డింగ్ కావటంతో మధిర పట్టణ నడిబొడ్డున ప్రధాన రైల్వే అండర్ బ్రిడ్జి రహదారి పక్కన ఉండటంతో నిత్యం వందలాది వాహనాలు ఈ బిల్డింగ్ పక్కన నుండి ప్రయాణిస్తుంటాయి. అయితే ఇటీవల కురుసిన వర్షాలకు బిల్డింగ్ గోడలకు, శ్లాబ్‌కు నీరు చేరి పెచ్చులూడటంతో పాటు చుట్టూ ఉన్న పహారి గోడలు నెర్రలుబారి వంగిపోవటంతో ఎప్పుడు కూలుతోందని వాహనదారులు, పాదచారులు బిక్కుబిక్కుమంటున్నారు. ఇదిలా ఉంటే రైల్వే ట్రాక్ పక్కన శిథిలావస్థ చేరిన బిల్డింగ్ వచ్చి పోయే ఫాస్ట్ ట్రైన్ల వలన వైబ్రేషన్ల కారణంగా కూలే ప్రమాదం ఉందని ఎవరికి ఎటువంటి నష్టం జరుగకూడదనే ఉద్దేశ్యంతో రైల్వే అధికారులు పెద్ద మొత్తంలో బిల్డింగ్ యజమానులకు నష్టపరిహారం చెల్లించారు. తొలగించాలని రైల్వే అధికారులు పెద్ద మొత్తంలో నష్టపరిహారం చెల్లించినా సంబంధిత యజమానులు మున్సిపాల్టీ నిబంధనల ప్రకారం బిల్డింగ్‌ను కూల్చివేయకుండా దర్జాగా అద్దెలకు ఇచ్చి సొమ్ము చేసుకుంటున్నారు. ఇంతా జరుగుతున్నా మున్సిపాల్టీ అధికారులు మాత్రం ఆ వైపు కన్నెత్తి చూడటం లేదు. ఈ తరుణంలో బిల్డింగ్ కూలి ఎవరికైనా ప్రాణనష్టం జరిగితే ఎవరూ బాధ్యత వహిస్తారని పట్టణ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. సంబంధిత అధికారులకు బిల్డింగ్ యజమానుల నుండి ముడుపులు అందడటంతోనే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పెద్ద ఎత్తున విమర్శలు విన్పిస్తున్నాయి. శిథిలావస్థలో చేరిన బిల్డింగ్‌లో అద్దెకు ఉంటున్న వ్యాపారులకు, షాపులకు వచ్చే కస్టమర్లకు, పక్కన ఉన్న రోడ్డుపై వెళ్లే వాహదారులకు, పాదచారులకు బిల్డింగ్ కూలి ప్రాణ నష్టం జరిగితే బిల్డింగ్ యజమానులు నష్టపరిహారం అందిస్తారా, అధికారులు నష్టపరిహారం అందిస్తారని అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. బిల్డింగ్ యజమానులు తమ స్వార్థం కోసం బిల్డింగ్‌ను పూర్తిగా కూల్చివేయకుండా ప్రజల ప్రాణాలతో చెలగాటమడుతున్నా అధికారులు తమకేమి పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు నిర్లక్ష్యణ ధోరణిని విడనాడి శిథిలావస్థకు చేరిన రాయల్ లాడ్జి బిల్డింగ్‌ను పూర్తిగా తొలగించి ప్రజలకు ఎటువంటి ప్రమాదం, ప్రాణ నష్టం జరుగకుండా చూడాలని మున్సిపాల్టీ ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు.

## ఫారం పాండ్‌లను రైతులు నిర్మించుకోండి



**ప్రజాపక్షం/చంద్రుగొండ:** ఫారం పాండ్‌లను రైతులు నిర్మించుకుంటే సేంద్రియ ఎరువులు తయారవుతాయని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని దామర్యల గ్రామంలో రైతు మామిడి తోటలో నూతనంగా తవ్విన మినీ ఫారం పాండు(డెమో)ను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తమ పంట చేలలో ఉన్న చెత్త పిచ్చి మొక్కలు ఎండిపోయిన కర్ర ముక్కలను మినీ పాండులో వేయటం వల్ల సేంద్రియ ఎరువులు తయారు కావడం జరుగుతుందన్నారు. అదే విధంగా భూగర్భ జలాలు సైతం పెరుగుతాయని తెలిపారు. దీని వల్ల రైతులకు అధిక ప్రయోజనాలు కలుగుతాయని, దీని వల్ల నీటి సాంద్రత పెరుగుతాయన్నారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో అశోక్, ఎంపీఓ ఖాన్, ఈజీఎస్ సిబ్బంది, రైతులు భోజ్య నాయక్, తదితరులు పాల్గొన్నారు.

## అయ్యప్పల పాదయాత్ర



**ప్రజాపక్షం/ఆళ్లపల్లి:** మర్కోడు శ్రీ రామాలయం నుండి పాతూరు గ్రామ శివారులోని ఉడుములగుట్ట వద్ద కొలువుదీరిన నరసింహ స్వామి ఆలయం వరకు అయ్యప్ప దీక్షపరులు 12కిలోమీటర్లు పాదయాత్ర ద్వారా చేరుకొని స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు అందుకున్నారు. అనంతరం ఆళ్లపల్లి మండల కేంద్రానికి చెందిన కాంట్రాక్టర్ ముక్తార్ పాషా స్వాములకి బిక్ష ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో గురుస్వాములు రణం మల్లికార్జున్, రణం శేఖర్, పొదిలా రాము, తాళ్ళపల్లి రమేష్, యాసరపు శ్రీను, మన్యం సుబ్బారావు, కోనేటి వీరభద్రాచారి, తాళ్లపల్లి కృష్ణారి, పాయం కోటేష్, వల్లోజు భరత్, మోదుకుదుంపురం దయాకర్‌చారి, తాళ్లపల్లి నవీన్, తదితరులు పాల్గొన్నారు.

## అశ్వాపురం గ్రామ పంచాయతీకి అరుదైన గౌరవం





**ప్రజాపక్షం/అశ్వాపురం:** అశ్వాపురం గ్రామ పంచాయితీకి జలశక్తి జల్ అభియాన్ కార్యక్రమంలో ఉత్తమ ప్రదర్శనగాను అరుదైన గౌరవం దక్కింది. సోమవారం సాయంత్రం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ చేతుల మీదుగా అశ్వాపురం గ్రామ పంచాయితీ కార్యదర్శి దాసరి మల్లేశం ఈ అవార్డును అందుకున్నారు. ఈసందర్భంగా గ్రామ పంచాయితీ కార్యదర్శి మల్లేశంను గ్రామ ప్రజలు, అధికారులు శుభాకాంక్షలు తెలిపారు.

## మహిళల అభ్యున్నతే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం



**ప్రజాపక్షం/చంద్రుగొండ:** మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు తుమ్మలపల్లి సురేష్ అన్నారు. మంగళవారం అయ్యన్నపాలెం గ్రామంలో డ్వాక్రా మహిళలకు ఇందిరమ్మ చీరలను పంపణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకున్న చొరవతో మహిళలల్లో ఆనందం నింపిందన్నారు. అదే విధంగా బీసీలకు కాంగ్రెస్ పార్టీలో సముచిత స్థానం ఇవ్వటంతో రాష్ట్రంలో జిల్లా పార్టీ అధ్యక్ష పదవులు అధికంగా వచ్చాయన్నారు. బీసీలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని, రాబోయే స్థానిక ఎన్నికల్లో అన్ని స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు గెలిసి తీరుతామన్నారు. ఈకార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు సారేపల్లి శేఖర్, సంక శంకర్, బుంగ శ్రీను, అన్వర్, రాములు, లక్ష్మణరావు, నున్న శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు, ఇస్లావత్ రుక్మిణి, తదితరులు పాల్గొన్నారు.

## వలస ఆదివాసీల సమస్యలు పరిష్కరించాలి



**ప్రజాపక్షం/ఆళ్లపల్లి:** వలస ఆదివాసీల సమస్యలు వెంటనే పరిష్కరించాలని వ్యవసాయ కార్మిక సంఘం బికేఎంయూ జిల్లా ప్రధాన కార్యదర్శి, సిపిఐ పార్టీ కార్యవర్గ సభ్యులు, ఆళ్లపల్లి మాజీ వైస్ ఎంపీపీ రేసు ఎల్లయ్య అన్నారు. మంగళవారం వలస ఆదివాసీల సమస్యలు పరిష్కరించాలని ఐటీడీఏ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సాగు చేస్తున్న పోడు భూములకు హక్కు పత్రాలు ఇవ్వాలని, వలస ఆదివాసీలు సాగు చేసుకుంటున్న పోడు భూముల పట్ల ఫారెస్ట్ అధికారుల దౌర్జన్యాలు వెంటనే ఆపాలి, వలస ఆదివాసీలకు ఎస్టీ కుల ధృవీకరణ పత్రం మంజూరు చేయాలన్నారు. ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని, విద్యా వైద్య విద్యుత్ రహదారుల సౌకర్యాలు కల్పించాలన్నారు. ఈకార్యక్రమంలో యువజన సంఘం ఏఐవైఎఫ్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సాధనపల్లి సతీష్, మాజీ జెడ్పిటిసి గొగ్గేల లక్ష్మీ, యువజన నాయకులు వజ్జ నరేష్, వలస ఆదివాసీల నాయకులు మడకం దేవా, వంజం సోనా, కోర్స మాడయ్య, అనిల్, కల్మ బొజ్జయ్య, దేవయ్య, లక్ష్మయ్య, భీమయ్య, బన్నీ, తదితరులు పాల్గొన్నారు.

# నవ భారత నిర్మాణానికి పటేల్ కృషి





**-యూనిటీ మార్చ్ పాదయాత్రను ప్రారంభించిన ఎంపి వద్దిరాజు**

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** నవ భారత నిర్మాణం కోసం నిరంతరం కృషి చేసిన మహోన్నత వ్యక్తి సర్దార్ వల్లభాయ్ పటేల్ అని ఆయన అడుగు జాడల్లో ప్రతి ఒక్కరూ పయనించాలని రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర తెలిపారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతిని పురస్కరించుకుని మంగళవారం సర్దార్ పటేల్ స్టేడియం ఆవరణలో కేంద్ర యువజన సర్వీసులు, క్రీడా వ్యవహారాల మంత్రిత్వ శాఖ, మేరా యువ భారత్ ఖమ్మం సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఎంపి వద్దిరాజు రవిచంద్ర హాజరై సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఐక్యత పాదయాత్రను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపి వద్దిరాజు మాట్లాడుతూ భారతదేశంలో స్వేచ్ఛ కోసం తపించే వారని ఎన్ని భాషలు మాట్లాడినా, ఎన్ని ప్రాంతాలున్నా మనమంతా ఒకటే నని చాటిచెప్పేవారని ఆయన తెలిపారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కూడా సంస్థానాలుగా విడివిడిగా ఉన్న దేశాన్ని ఒకటి చేయడంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ ఎంతో కృషి చేశారన్నారు. భారతదేశ ప్రజలను చైతన్య పరిచి ఏక తాటిపై నడిపించిన మహనీయుడు పటేల్ అని కొనియాడారు. ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా ఐక్యత (అప్తాన్ నిర్భార్ భారత్) ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో మేరా యువ భారత్ ఖమ్మం జిల్లా డిప్యూటీ డైరెక్టర్ అన్వేష్ చింతల, మాజీ ఎంఎల్‌సి పొంగులేటి సుధాకర్‌రెడ్డి, డివైఎస్‌వో తుంబూరు సునీల్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ కన్వీనర్ డా॥ నర్సింగి శ్రీనివాసరావు, గిరిజన డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రజని, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే సిఎం లక్ష్యం



**శాసన సభ్యులు డా. మట్టా రాగమయి దయానంద్**





**ప్రజాపక్షం/సత్తుపల్లి:** కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేయడమే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లక్ష్యమని, మహిళలు రైతుల పక్షపాతిగా ప్రజా ప్రభుత్వం వర్ధిల్లుతుందని శాసన సభ్యురాలు డా.మట్టా రాగమయి దయానంద్ విజయ్ కుమార్ అన్నారు. పట్టణంలోని ఎం.ఆర్ గార్డెన్స్ లో రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు డా.మట్టా దయానంద్ విజయ్ కుమార్ ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘాలకు వడ్డీ లేని రుణాల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సత్తుపల్లి ఎమ్మెల్యే డా.మట్టా రాగమయి హాజరై సత్తుపల్లి నియోజకవర్గానికి విడుదలైన రూ.4,67,35,000 చెక్కులను డ్వాక్రా సంఘాలకు అందజేశారు.అనంతరం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే రాగమయి దయానంద్ మాట్లాడుతూ రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేయాలన్న రాష్ట్ర ప్రభుత్వ సంకల్పానికి నిదర్శనంగా రాష్ట్రంలోని మూడు లక్షల 50 వేల స్వయం సహాయక మహిళా సంఘాలకు రూ.304 కోట్ల వడ్డీ లేని రుణాలను ప్రభుత్వం అందించనున్నదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఒకే రోజు వడ్డీ లేని రుణాలను మూడో విడత అందించేందుకు శ్రీకారం చుట్టిందన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రెండుసార్లు వడ్డీ లేని రుణాలను ఇచ్చిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిదన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే మహిళలను కోటీశ్వరులుగా చేస్తామని, వారి కాళ్ళ మీద వారిని నిలబడేలా తీర్చిదిద్ది కుటుంబాలను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు, తద్వారా మహిళలు ఆర్థికంగా ఎదిగి స్వయం సమృద్ధి సాధించేందుకు చర్యలు తీసుకుంటామన్న ప్రజా ప్రభుత్వ హామీ మేరకు మహిళలకు అన్ని రంగాలలో అవకాశాలు కల్పిస్తుందన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళలకు ఉచిత బస్సు, ఉచిత కరెంటు, రూ.500 గ్యాస్, ఇందిరమ్మ ఇల్లు, వడ్డీ లేని ఋణం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో పథకాలు అందుతున్నాయన్నారు. మహిళా సంఘాల కు పాఠశాల విద్యార్థుల యూనిఫామ్స్ కుట్టే పనిని, అమ్మ ఆదర్శ పాఠశాల పనులను అప్పగించింది. బ్యాంకు లింకేజీ ద్వారా రుణాలను కల్పించడం, ఇటీవల కాలంలో పెట్రోల్ బంకుల నిర్వహణను కూడా మహిళలకు అప్పగించిందని తెలిపారు. అంతేకాక ప్రతి జిల్లా కేంద్రంలో ఎంపిక చేసిన ప్రాంతాలలో మహిళా శక్తి క్యాంటీన్లను ఏర్పాటు చేయడమే కాకుండా, వికలాంగులు, జెండర్ సమస్యల కోసం సామాజిక కార్యక్రమాల నిర్వహణను, గ్రామ సంఘాలకు, మండల సమాఖ్యలకు భవనాల నిర్మాణం వంటి అభివృద్ధి కార్యక్రమాలను ప్రభుత్వం కల్పిస్తున్నది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి చైర్మన్లు దోమ ఆనంద్ బాబు, భాగం నీరజ చౌదరి, మున్సిపల్ వైస్ మాజీ చైర్మన్ తోట సుజలా రాణి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గాదే చెన్నకేశవరావు, మండల అధ్యక్షుడు శివ వేణు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కమల్ పాషా, పింగుల సామ్యూల్, ఉడతనేని అప్పారావు, జీవన్, సత్తుపల్లి నియోజకవర్గం 5మండలాల తహశీల్దార్ లు, ఎంపిడిఓ లు, ఎంఎస్ లు,ఏపిఎం లు, గ్రామ దీపికలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రశ్నార్థకంగా వ్యవసాయ కూలీల జీవన గమనం




**- మాస్‌లైన్ రాష్ట్ర నాయకులు గుమ్మడి నర్సయ్య**

**ప్రజాపక్షం/ తిరుమలాయపాలెం :** తెలంగాణ రాష్ట్రంలో వ్యవసాయ కూలీల జీవనం ఎంతో ప్రశ్నార్థకంగా ఉందని, రాష్ట్రంలో 55శాతం వ్యవసాయ భూమి కలిగి ఉన్న రాష్ట్రంలో ఆధునీకరణ యంత్రాలతో వ్యవసాయం చేయడం ద్వారా వ్యవసాయ కూలీలు పని దొరకక దుర్భర జీవితం గడుపుతున్నారని మాస్‌లైన్ ప్రజాపంథా రాష్ట్ర నాయకులు, ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య అన్నారు. మండల పరిధిలోని దమ్మాయిగూడెం పొట్లపల్లి శ్రీశైలం నగర్ వేదికగా జరిగిన ఎఐపికెఎంఎస్ అఖిలభారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రథమ మహాసభలను ఘనంగా నిర్వహించారు. ఈ మహాసభలో అధ్యక్ష వర్గం ఆర్.శివలింగం, ఎస్ వెంకటేశ్వర్లు, గంట శ్రీను అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో 50శాతం వ్యవసాయం భూమి కలిగి ఉన్న రాష్ట్రంలో వ్యవసాయ కూలీలకు పని దొరకపోవడం వ్యవసాయం యాంత్రీకరణ పద్ధతిలో చేయడం ద్వారా కూలీలకు సంవత్సరం పొడుగునా పనులు దొరకట్లేదని ప్రభుత్వం కూలీలను ఆదుకోవాలని ఆయన అన్నారు. ప్రతి వ్యవసాయ కూలీకి సంవత్సరానికి రూ.12వేలు ఆర్థిక ప్రోత్సాహం కల్పించాలని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయాలని అన్నారు. కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తూ ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేస్తూ కార్పొరేట్ శక్తులను ప్రోత్సహిస్తుందని ఆయన దుయ్యబట్టారు. పాలక ప్రభుత్వాలు పేద ప్రజల అభ్యున్నతికి పాటుపడాలని, లేనిపక్షంలో భవిష్యత్ పోరాటాలకు సిద్ధమవుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాస్‌లైన్ ప్రజాపంథా నాయకులు బందెల వెంకయ్య, కమ్మకోమిటి నాగేశ్వరరావు, కూసు అప్పారావు, తిమ్మిడి హన్మంతరావు, ఆరెపల వెంకన్న, సోమనపల్లి వెంకటేశ్వర్లు, కొత్తపల్లి వెంకటరెడ్డి, ఉన్నం నరేష్, కొల్లి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# పట్టణ స్త్రీ శక్తి నూతన మహిళా సమాఖ్య ఎన్నిక



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు నూతన మున్సిపాలిటీ పరిధిలోని 17 గ్రామ సమాఖ్యలు సమావేశం మంగళవారం జరిగింది. ఈ సమావేశంలో సమైక్య ఓబి సభ్యులు రిసోర్స్ పర్సన్లు సమన్వయంతో టిఎంసి సుజాత ఆధ్వర్యంలో నూతన సమావేశం జరిగింది. ఈ సమావేశంలో నూతన పట్టణ మహిళా సమాఖ్య ఎన్నిక ఐదుగురితో జరిగింది. నూతనముగా ఈ సమాఖ్య పేరు స్త్రీ శక్తి మహిళా సమైక్యగా నామకరణ చేశారు. అధ్యక్షులుగా కంభంపాటి వెంకటలక్ష్మి , కార్యదర్శిగా చింతపల్లి రమణ, కోశాధికారిగా ధరావత్ దివ్య, పెరిక ప్రియాంక సహాయ కార్యదర్శిగా, షేక్ షహనాజ్ ఉపాధ్యక్షులుగా, నూతన పట్టణ స్త్రీ శక్తి మహిళా శక్తి గా ఎంపికయ్యారు. వీరికి త్వరలో బ్యాంకు ఖాతా ప్రారంభించి పట్టణ స్త్రీ శక్తి సమైక్య ద్వారా మహిళలు ఆర్థిక అభివృద్ధికి జీవనోపాదులు కల్పనకు రుణాలు అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు సుజాత తెలిపారు. ఈ కార్యక్రమంలో టిఎంసి నరేష్, పర్సనల్ మహిళా సమాఖ్యలు పాల్గొన్నారు. నూతన మహిళా సమైక్యంగా ఎన్నికైన వారందరికీ ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు.

# ఎన్నికల నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించాలి



**ప్రజాపక్షం/పెనుబల్లి:** ఎన్నికల నిబంధనలను ప్రతి ఒక్కరు పాటించాలని ఎస్సై వెంకటేష్ అన్నారు. ఎన్నికల కోడ్ అమలు అవుతున్న తరుణంలో పెనుబల్లి మండలం యడ్లబంజర్ గ్రామంలో ఎన్నికల సమయంలో పాటించవలసిన విధానాలను, అలాగే గంజాయి నిర్మూలన, సైబర్ నేరాల పట్ల తదితర వాటిపై మంగళవారం ప్రజలకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై వెంకటేష్ మాట్లాడుతూ ఎన్నికల నిబంధనల ప్రకారం ప్రజలందరూ అవగాహన కలిగి ఎన్నికల నిబంధనలను ప్రతి ఒక్కరు పాటించాలని సూచించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు పాల్పడకుండా ఉండాలని ఎన్నికల నిబంధనలను అతిక్రమిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికల కోడ్ ఉన్నంతవరకు ప్రజలు జాగ్రత్తగా పోలీసు వారి సూచనలను పాటిస్తూ మెలిగి ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ సత్యనారాయణ, కానిస్టేబుళ్లు తదితరులు పాల్గొన్నారు.

# బస్ డిపోను సందర్శించిన రీజనల్ మేనేజర్



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** సత్తుపల్లి బస్ డిపోను ఆర్.టి.సి రీజనల్ మేనేజర్ ఎ.సరిరాం మంగళవారం సందర్శించారు. పుణ్యక్షేత్రాల దర్శన పేరుతో పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశామని భక్తులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. శబరిమలై వెళ్లే అయ్యప్ప స్వాముల సౌకర్యార్థం ఖమ్మం రీజన్ పరిధిలో అన్ని డిపోల నుండి బస్సులు ఏర్పాటు చేసినట్లు ఆయన వివరించారు. అయ్యప్పలు వారు సూచించిన రూట్ ప్రకారం బస్సు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. యాత్ర దానం దాతలు ముందుకు వచ్చినట్లయితే ప్రత్యేక బస్సులను ప్రత్యేక అవసరాలు ఉన్నవారికి ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. సత్తుపల్లి బస్టాండ్ ను పరిశీలించి, గ్యారేజీ సిబ్బందితో సమావేశమయ్యారు. డిపో అభివృద్ధికి తీసుకోవలసిన చర్యలను డిపో మేనేజర్ ఊటుకూరి సునీత కు వివరించారు. ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అనేక చర్యలు చేపడుతున్నట్లు అయన తెలిపారు.ఈ కార్యక్రమంలో సత్తుపల్లి డిపో మేనేజర్ ఊటుకూరి సునీత, అసిస్టెంట్ మేనేజర్ పి విజయ శ్రీ, అసిస్టెంట్ మెకానికల్ ఇంజనీర్ సాహితి, ఆర్టీసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అమౌంట్ తక్షణమే చెల్లించాలి



**ప్రజాపక్షం/వైరా:** వైరా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న ట్రైనింగ్ సెంటర్‌ను పిఆర్‌టియుసి మాజీ అధ్యక్షులు యలమద్ది వెంకటేశ్వర్లు, వైవి, వైరా మండల శాఖ సందర్శించి పిఆర్‌టియు ఖమ్మం జిల్లా శాఖ చేపట్టబోయే 30 గంటల నిరహార దీక్షను ఉపాధ్యాయులందరూ జయప్రదం చేయాలని కోరారు. ఈ సందర్భంగా యలమద్ది వెంకటేశ్వర్లు వైవి మాట్లాడుతూ దాదాపు మూడు దశాబ్దాలకు పైగా ఉపాధ్యాయ ఉద్యోగ వృత్తిలో ఉండి ప్రభుత్వానికి సేవలు అందించి మన జీతం నుంచి కట్ చేసి దాచుకున్నటువంటి ఇన్సూరెన్స్ అమౌంట్, జిపిఎఫ్ అమౌంట్ తక్షణమే చెల్లించాలని, అదేవిధంగా రిటైర్డ్ అయిన ఉపాధ్యాయుల గ్రాడ్యుటీ, పెడింగ్ బిల్లులు, డిఏలను వెంటనే రిలీజ్ చేసి పిఆర్సిని తక్షణమే చేయాల్సిందిగా ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో పిఆర్‌టియు వైరా మండల శాఖ అధ్యక్షులు వెలిశెట్టి నర్సింహారావు, ప్రధాన కార్యదర్శి వేమిరెడ్డి గోవర్ధన్‌రెడ్డి, మండల ప్రధాన బాధ్యులు చంద్రశేఖర్‌రెడ్డి, అన్నాబత్తుల రమేష్, సూర్యదేవర సురేష్ పాల్గొన్నారు.

# తాజా మాజీ జిల్లా అధ్యక్షులకు సన్మానం



**ప్రజాపక్షం/వైరా:** జిల్లా కాంగ్రెస్ తాజా మాజీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ, పువ్వాళ్ళ దుర్గాప్రసాద్‌ను మంగళవారం వైరా ఎన్‌విఎస్ గార్డెన్‌లో మర్యాదపూర్వకంగా కలిసిన వైరా మున్సిపాలిటీ రెండో వార్డు మాజీ కౌన్సిలర్ బత్తుల గీత శ్రీనివాస్‌రావు దంపతులు శాలువా కప్పి వారిని సన్మానించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన నూతి సత్యనారాయణకు శుభాకాంక్షలు తెలిపి అదేవిధంగా పువ్వాళ్ళ దుర్గాప్రసాద్‌కు పార్టీ అభివృద్ధిలో కీలకపాత్ర పోషించినందుకు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# ఎన్నికల ఏర్పాట్లు శరవేగంగా పూర్తి చేయాలి

**-ఎన్నికల విధులకు అధికారులు, సిబ్బంది సిద్ధంగా ఉండాలి**
**-జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ**



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** ఎన్నికల ఏర్పాట్లు ను జిల్లా లో శరవేగంగా పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎన్నికల కు సంబంధించిన ముందస్తు ఏర్పాట్లు పై అధికారుల తో మంగళవారం ప్రత్యేక సమావేశం ను నిర్వహించారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాట్లు, సౌకర్యాలు తదితర అంశాల పై సమీక్షించారు. పలు సూచనలు, సలహాలు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికలకు ఏర్పాట్లు ను పూర్తి చేయాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల వద్ద కనీస సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ఓటర్ల కు ఎలాంటి అసౌకర్యం, కలగకుండా తగిన ఏర్పాట్లు చేయాలని అన్నారు. ఎన్నికలకు సంబంధించిన ఏర్పాట్లలో నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు. పోలింగ్ కేంద్రాలకు పంపించే వాహనాలను సిద్ధం చేసుకోవాలని పేర్కోన్నారు. అధికారులు, సిబ్బంది ఎన్నికలకు అప్రమతంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ యం.యర్రయ్య, మండల పంచాయతీ అధికారి సి.హెచ్.శివ, మండల విద్యాశాఖాధికారి బాలిన చలపతిరావు తదితరులు పాల్గొన్నారు.

# వైరా రిజర్వాయర్ ఆయకట్టు రైతులకు అండగా ఉంటా

**-డిసెంబర్ మొదటి వారంలో**
**రిజర్వాయర్ నుంచి నీరు విడుదల**
**-ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్**



**ప్రజాపక్షం/వైరాః** ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ నీటిపారుదలశాఖ అధికారులు, అఖిలపక్ష నాయకులు, రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ మాట్లాడుతూ వైరా రిజర్వాయర్ ఆయకట్టు రైతులకు ఎప్పుడు అండగా ఉంటానని, రెండు పంటలు పండించుకునేందుకు రూ.100కోట్లు వెచ్చించి సీతారామ ప్రాజెక్ట్ నుంచి రాజీవ్‌కెనాల్ ద్వారా వైరా రిజర్వాయర్‌కు అనుసంధానం చేసి వైరా రిజర్వాయర్‌కు ఎప్పుడు నిండుకుండలా ఉంటుందని రెండు పంటలు పండించుకునేందుకు నీళ్లు అందుతాయని అన్నారు. రబీ పంట సాగు డిసెంబర్ మొదటి వారంలో కుడి ఎడమ కాల్వల ద్వారా నీళ్లు విడుదల చేస్తామని అఖిలపక్ష నాయకులతో వైరా రిజర్వాయర్ ఆయకట్టు రైతులతో ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో నీటిపారుదలశాఖ డిఈ శ్రీనివాసరావు, మార్క్‌ఫెడ్ మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, వైరా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బోళ్ళ గంగారావు, మండల కాంగ్రేస్ అధ్యక్షులు శీలం వెంకటనర్సిరెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ మట్టూరి వెంకటేశ్వరరావు, మాజీ మున్సిపాల్ చైర్మన్ సూతకాని జైపాల్, వైరా నియోజకవర్గ టిడిపి ఇంచార్జి చెరుకూరి చలపతిరావు, తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు, దాసరి దానియేలు, మచ్చా బుజ్జి, కట్ల సంతోష్, శ్రీరామనేని భాస్కర్, పమ్మి అశోక్, వీరంశెట్టి సీతారాములు, శీలం చంద్రశేఖర్‌రెడ్డి, గుత్తా రామారావు, నర్వనేని అశోక్, మంచాల జయరాజు, గుత్తా కళావతి, షేక్ మస్తాన్, గొల్లపూడి కృష్ణారావు, జవ్వాజి నాగరాజు, సూర్యదేవర శ్రీధర్, కొల్లి రమేష్, ఆత్మ డైరెక్టర్ జాలాది రామకృష్ణ, ఆర్యవైశ్య కార్పొరేషన్ జిల్లా ఇంచార్జి గ్రంది ప్రవీణ్, మాజీ మార్కెట్ డైరెక్టర్ వేల్పుల మురళి, పూర్ణ తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో అర్హులకు అన్యాయం



**ప్రజాపక్షం/జూలూరుపాడుః** సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ ప్రజాప్రంథా మండల కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో కార్యాలయంలోని సూపర్డెంట్ రవికి సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. పేదలను గుర్తించి ఇళ్ల స్థలాలు లేని వారిని ఇల స్థలాలు ఇప్పించాలని తహశీల్దార్ శ్రీనివాసరావుకి వినతి పత్రం అందజేశారు. అనంతరం ఈ ధర్నా కార్యక్రమాన్ని ఉద్దేశించి సిపిఐ ఎంఎల్ మాస్ కొత్తగూడెం డివిజన్ కార్యదర్శి జాటోత్ కృష్ణ, పార్టీ మండల కార్యదర్శి బానోతు ధర్మలు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు పేదలకు ఇచ్చిన హామీ ఇందిరమ్మ ఇల్లు ప్రతి ఒక్కరికి ఇస్తామని ఆరు గ్యారెంటీలు ఇచ్చిన వాటిలో ఈ పథకం ఒకటని, ఈ పథకాన్ని గ్రామస్థాయిలో ఇందిరమ్మ కమిటీ పేర్లతో ఈ పథకం అదోగతి పాలు అయిందని వారు అన్నారు. ఈ పథకం పారదర్శకంగా పేదలను గుర్తించడంలో రాజకీయ జోక్యంతో ఉందని ఇది సరైనది కాదని వారు గుర్తు చేశారు. గ్రామస్థాయిలో సభలు ఏర్పాటు చేసి పేదలను గుర్తించి ప్రజా పాలన రశీదు ప్రతి ఒక్క పేదలకు ఇచ్చారని, వారు గుర్తు చేశారు. స్థానిక అధికారులకు స్థానిక ఎమ్మెల్యే కి సమస్యలతో కూడిన వినతిపత్రం అనేక దపాలుగా దరఖాస్తులు విన్నవించినా ఆ దరఖాస్తు ఫలితము లేకపోవటం, దీనివల్ల పేదలు కాంగ్రెస్ పాలనపై ఇసుగు చెందుతున్నారని వారు అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చెప్పే మాటలకు ఆచరణ చాలా వ్యత్యాసంగా ఉందని వారు అన్నారు. నిరుపేదలకు అందాల్సిన పథకాలు రాజకీయ జోక్యంతో కమిటీలు ఏకపక్ష నిర్ణయం కొనసాగితే రాబోయే రోజుల్లో జరిగే ఎన్నికల్లో తగిన గుణపాఠం ఎదుర్కోక తప్పదని వారు తెలియజేశారు. ఇప్పటికైనా ప్రజా పాలన రశీదు ఆధారంగా అర్హులైన పేదలను గుర్తించి ఇందిరమ్మ కమిటీల జోక్యం లేకుండా పేదలకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని వారు ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. లేని ఎడల మండలంలో పేదలను సమీకరించి రాజకీయాలకతీతంగా పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని ప్రభుత్వానికి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల నాయకులు పొరుపల్లి బాబురావు, జి. బాలకోటి, గంకల వెంకటమ్మ, పద్మావతి, కల్తీ శేఖర్, శివకుమార్, రంజిత్ కుమార్, కృష్ణవేణి, అనసూయ బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

# లెనిన్ శ్రీనివాస్‌కు మరో కవిత పురస్కారం




**ప్రజాపక్షం/ఖమ్మం :** ఖమ్మం జిల్లాకు చెందిన ప్రముఖ కవి లెనిన్ శ్రీనివాస్‌కు మరో పురస్కారం లభించింది. విజయవాడ తుమ్మలపల్లి కళా క్షేత్రంలో జరిగిన మల్లె తీగ సాహిత్య సంస్థ ఆధ్వర్యంలో లెనిన్ శ్రీనివాస్ రచించిన మారక పోతే మారణ శాసనమే అనే కవిత ఆలాపనకు సాహిత్య పురస్కారం లభించింది. అంగ రంగ వైభవంగా జరిగిన సభలు, కవి సమ్మేళనాల్లో లెనిన్ శ్రీనివాస్ కవిత పలువురిని ఆకట్టుకుంది. సభికుల నుండి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా లెనిన్ శ్రీనివాస్‌ను పురస్కారంతో సత్కరించారు. ఈ సందర్భంగా డా॥ జివి పూర్ణచంద్ మాట్లాడుతూ సాహిత్యంలో ఒక లెజెండ్‌గా లెనిన్ శ్రీనివాస్ తయారయ్యారని ఖమ్మం జిల్లా లెనిన్ శ్రీనివాస్ సాహిత్యంలో కనపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ లక్ష్మిషా తోపాటు కలిమిశ్రీ, జల్ది విద్యాసాగర్, వెంటకరమణ, బిక్కి కృష్ణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సాహితీవేత్తలు సాహిత్య సంస్థల బాధ్యులు సాధనాల వెంకటస్వామి నాయుడు, కాంతేశ్వరరావు, మలిశెట్టి కృష్ణమూర్తి, రామయ్య, వాసు, రాజేందర్, డా॥ నిత్యల, వెంకట కృష్ణ, రాధా, వీరభద్రం, విజయరామరాజు, వసంత, భారతి, శైలజ, శ్రీనివాస్ తదితరులు లెనిన్ శ్రీనివాస్‌ను అభినందించారు.

# ఇందిరమ్మ చీరల పంపిణీ పరిశీలన



**ప్రజాపక్షం/ఏన్కూరు :** ఇందిరమ్మ చీరల పంపిణీలను మంగళవారం కల్లూరు డివిజన్ సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ ఐఏఎస్ పరిశీలించారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని తూతకలిగానిపేట గ్రామ పంచాయతీలో గల ఇందిరానగర్ కాలనీలో ఇందిరమ్మ చీరల పంపిణీ ఎలా జరుగుతుందని గ్రామ సమైక్యలను ఆయన అడిగి తెలుసుకున్నారు. పరిశీలించిన అనంతరం ఆయన చేతుల మీదుగా చీరల పంపిణీ చేశారు. ఆయన మహిళలతో మాట్లాడుతూ ఇందిరమ్మ చీరలు ఎలా ఉన్నాయి అని అడగగా మహిళలు మంచిగా ఉన్నాయని తెలిపారు. అదే విధంగా రాష్ట్ర ప్రభుత్వం వడ్డీ లేని రుణాలు ఇస్తుందని ఆయన తెలిపారు. రుణాలు తీసుకొని మంచి వ్యాపారాలు పెట్టుకొని లాభాలు పొందాలని ఆయన కోరారు. ఇంకేమైనా అవసరాలు ఉంటే తమకి తెలియజేస్తే ప్రభుత్వం ద్వారా సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపిఎం కందుకూరి శ్యామ్ కుమార్, సీసీ జరపల వెంకటేశ్వర్లు, అకౌంటెంట్ పువ్వాల గోపి, గ్రామ దీపిక ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

# కాలవలో గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం



**ప్రజాపక్షం/ఏన్కూరు :** సాగర్ కాలవలో గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు ఎస్ఐ నారబోయిన సంధ్య తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని తిమ్మారావుపేట గ్రామానికి చెందిన వ్యక్తి బత్తుల దుర్గాప్రసాద్ (28) గ్రామ సమీపంలోని సాగర్ కాలువ లో పడి గల్లంతయ్యాడు. తన అన్నయ్య బత్తు ల ఎల్లయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై సంధ్య కేసు నమోదు చేశారు. దుర్గాప్రసాద్ ను గాలించేందుకు పోలీస్ సిబ్బంది, రెస్క్యూ టీం గాలింపు చర్యలు చేపట్టి మృతదేహాన్ని రాజలింగాల గ్రామ సమీపంలో సోమవారం రాత్రి సుమారు 12 గంటల సమయంలో వెలికి తీశారు.మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఖమ్మం తరలించి పోస్టుమార్టం నిమిత్తం కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు.

# ఏఈ రామారావుకు ఏడీగా పదోన్నతి



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** స్థానిక విద్యుత్ శాఖ ఏఈ గా పని చేస్తున్న కె.రామారావు కు పదోన్నతి లభించింది. ఇల్లందు ఏడీ (ఆపరేషన్) గా పదోన్నతి కల్పించారు. ఈ మేరకు మంగళవారం నేలకొండపల్లి ఏఈ నుంచి రీలీవ్ అయ్యారు. నేలకొండపల్లి ఏఈగా మండల ప్రజలతో ఉత్తమ అధికారిగా గుర్తింపు పొందారు. జిల్లా స్థాయిలో అత్యంత ప్రతిభ చూపి ఉత్తమ అధికారిగా అవార్డు ను అందుకున్నారు. వినియోగదారుల సమస్యల పరిష్కారంలో తనదైన ముద్ర ను వేసుకున్నారు. పదోన్నతి పై బదీలీ వెళ్తున్న రామారావు ను పలువురు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

# మండల కేంద్రాలకు చేరిన బ్యాలెట్ బాక్సులు



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** స్థానిక సంస్థల ఎన్నికల నేపధ్యంలో ముందస్తు గా బ్యాలెట్ బాక్స్ లు సిద్ధం చేశారు. జిల్లా కేంద్రం నుంచి మండలం లోని కొత్తకొత్తూరు కేంద్రం కు మంగళవారం చేరాయి. మండలం లోని 32 గ్రామ పంచాయతీలకు సంబంధించిన 300 వార్డులకు గాను 360 బాక్స్ లను జిల్లా కేంద్రం నుంచి కొత్తకొత్తూరు లోని డ్రిస్టిబ్యూషన్ మరియు రిస్పెషన్ కేంద్రంలో భద్రపరిచారు. వీటిని నేలకొండపల్లి మండల పరిషత్ అభివృద్ధి అధికారి యం.యర్రయ్య. మండల పంచాయతీ అధికారి సి.హెచ్.శివ నేతృత్వంలో బ్యాలెట్ బాక్స్ లను పరిశీలించారు. ఎన్నికల కు సంబంధించిన బాక్సు ఈ కేంద్రం నుంచి తీసుకెళ్లి తిరిగి కౌంటింగ్ పూర్తి కాగానే ఇదే కేంద్రం లో సంబంధిత రిటర్నింగ్ అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు అప్పచెప్పాల్సి ఉంది. అందుకు తగిన ఏర్పాట్లు ను పరిశీలించారు.

# పంట అవశేషాలు తగలబెట్టొద్దు



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** పంట అవశేషాలను తగలబెట్టొద్దని నేలకొండపల్లి మండల వ్యవసాయాధికారి యం.రాధ సూచించారు. మండలం లోని వివిధ గ్రామాలలో మంగళవారం పంట అవశేషాలను తగలబెడుతున్న రైతుల వద్దకు వెళ్లి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. భూమిలో మేలు చేసే సూక్ష్మ క్రిము లు లక్షల సంఖ్యలో ఉంటాయని పేర్కొన్నారు. వాటి వలన భూమిలో సేంద్రియ పదార్ధం ఏర్పడుతుందని అన్నారు. పంట అవశేషాలు తగలబెట్టినట్లుయితే సూక్ష్మజీవులు చనిపోతాయని అన్నారు. దీని వలన భూమి సారం కోల్పోతుందని అన్నారు. రైతులు రోటావేటర్ ద్వారా అవశేషాలను కలియదున్ని నీరు పెట్టాలని అన్నారు. అనంతరం సింగిల్ సూపర్ ఫాస్పెట్ చల్లితే అవశేషాలు మురిగి ఎరువు తయారు అవుతుందని అన్నారు. కావునా రైతులు తగలబెట్టకుండా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ విస్తీరణాధికారి అరవింద్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాలతో దళారులకు అడ్డుకట్ట



**- పెనగడపలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన కూనంనేని**

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** ధాన్యం కొనుగోల కేంద్రాలు ఏర్పాటుతో దళారుల అక్రమాలకు అడ్డుకట్ట పడిందని, రైతులు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంఎల్ఏ కూనంనేని సాంబశివరావు అన్నారు. చుంచుపల్లి మండల పరిధిలోని పెనగడప గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. అనంతరం జరిగిన రైతు సభలో కూనంనేని మాట్లాడుతూ రైతులకు మద్దతుధర కల్పించేందుకు, రవాణా భారాన్ని తగ్గించేందుకు సహకార సంగాల ద్వారా నియోజకవర్గ వ్యాప్తంగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని, రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేసే విధంగా ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. ధాన్యం కొనుగోలు విషయంలో అధికారులు ఎలాంటి అలసత్వం వహించరాదని, నాణ్యతా ప్రమాణాల పేరుతు రైతులను ఇబ్బందులు పెట్టవద్దన్నారు. సమస్యలు ఏమైన ఉంటే తమ దృష్టికి తేవాలని, పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. రైతులకు చెల్లించాల్సిన నగదు వారి వారి ఖాతాల్లో త్వరితగతిన జమలు చేయాలని చెప్పారు. తూకపు మిషన్లు, బస్తాల కొరత లేకుండా చూసుకోవాలని, ఈ కేంద్రం ఏర్పాటుతో పెనగడప పరిసర ప్రాంతాలకు చెందిన రైతులు తమ ధాన్యాన్ని అమ్ముకునేందుకు చక్కటి సదుపాయం కలిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్ పాషా, సంఘం అధ్యక్షులు వీరహనుమంతరావు, ఉపాధ్యక్షులు కూచుపూడి జగదీష్, తహాశిల్దార్ కృష్ణప్రసాద్, ఎంపిడిఓ సుభాషిణి, ఓఏ రామేశ్వరి, నాయకులు సలిగంటి శ్రీనివాస్, వీరస్వామి, వి మల్లికార్జునరావు, సుధాకర్, మన్నే వెంకన్న, హుమాయున్ తోట రాజు, జగదాంబ, స్థానిక రైతులు తదితరులు పాల్గొన్నారు.

# కార్పోరేషన్ అభివృద్ధికి శక్తివంచన లేని కృషి

**- ప్రజల మౌళిక సదుపాయాల కల్పనే ధ్యేయం**
**- ఎంఎల్ ఏ కూనంనేని**
**- రూ.45 లక్షల అభివృద్ధి పనులు శంకుస్థాపన**



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** కొత్తగూడెం కార్పోరేషన్ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేయనున్నట్లు, ఇందులో భాగంగా పెద్ద ఎత్తున మౌళిక సదుపాయాల కల్పన జరుగుతోందని ఎంఎల్ఏ కూనంనేని సాంబశివరావు అన్నారు. కొత్తగూడెం కార్పోరేషన్ 57వ డివిజన్ పరిధిలోని గాజుల రాజం బస్తి, హనుమాన్ బస్తీ పరిధిలో రూ.35లక్షల వ్యయంతో చేపడుతున్న సిసి రోడ్, రూ.10 లక్షల వ్యయంతో చేపట్టనున్న కమ్యూనిటీ హాల్ అదనపు పనులకు ఎంఎల్ఏ మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సభలో కూనంనేని మాట్లాడుతూ ప్రజలకు కావాల్సిన మౌళిక వసతులు కల్పించే బాధ్యతను విస్మరించబోనని, ప్రజా అవసరాలను గుర్తించి ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరించేందుకు కృషి చేయనున్నట్లు తెలిపారు. శంకుస్థాపనలు పూర్తయిన అభివృద్ధి పనులు నాణ్యతతో పది కాలాల పాటు నిలిచే ఉండేలా చేపట్టాలని అన్నారు. అవినీతికి తావులేకుండా అభివృద్ధి పనులను ప్రజలు ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. పనులు వేగవంతంగా పూర్తి చేసి అందుబాటులోనికి తేవాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్,సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్ పాషా, గ్రంధాలయ చైర్మన్ వీరబాబు, కాంగ్రెస్ నాయకులు నాగసీతారాములు, కమీషనర్ సుజాత, ట్రైనీ కమీషనర్ అభిలాష్, మాజీ కౌన్సిలర్లు సాహేరా బేగం, 3టౌన్ కార్యదర్శి, మాజీ కౌన్సిలర్ ఎండి యూసుఫ్, అబ్దుల్ రహమాన్, మసూద్, బోగం రామ్మూర్తి, బండారి రాములు, శ్రీను, మౌలాన, రాజు, పాపారావు, పిల్లి రామస్వామి, జయలక్ష్మి , రమ, సరోజ, రాజకుమారి, అనూష తదితరులు పాల్గొన్నారు.

# వడ్డీ లేని రుణాలు మహిళా సాధికారితకు చేయూత

**- వడ్డీ లేని రుణాల చెక్కులు అందించిన ఎంఎల్ఏ, కలెక్టర్**





**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** స్వయం సహాయక సంఘాల మహిళలకు వడ్డీ లేని రుణాలు అందించడం మహిళా సాధికారితకు తార్కాణమని కొత్తగూడెం ఎంఎల్ఏ కూనంనేని సాంబశివరావు అన్నారు. కొత్తగూడెం క్లబ్‌లో మంగళవారం నియోజకవర్గవ్యాప్తంగా ఉన్న మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాల చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ ఈ రుణాలు మహిళల ఆర్థికాభివృద్ధికి వ్యాపారవిస్తరణకు ఎంతగానో ఉపయోగపడతాయని చెప్పారు. ప్రభుత్వం ద్వారా అందుతున్న నిధులను మహిళా సంఘాలు సద్వినియోగం చేసుకుని వ్యాపార రంగంలో రానించి మరింత మందికి ఉపాధి కల్పించే దిశగా ఎదగాలని చెప్పారు. అనంతరం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ మాట్లాడుతూ మహిళా సంఘాలు పటిష్టంగా ఉంటేనే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని అందుకే పొదుపు సంఘాలకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్ పాషా, చుంచుపల్లి మండల కార్యదర్శి వాసిరెడ్డి మురళీ, సహకార సంఘ అధ్యక్షులు మండే వీరహనుమంతరావు, మాజీ డిసిసిబి చైర్మన్ కొత్వాల శ్రీనివాస్, గ్రంధాలయ చైర్మన్ పసుపులేటి వీరబాబు, కొత్తగూడెం తహాశిల్దార్ పుల్లయ్య, అదనపు డిఆర్‌డిఏ నీలేష్, చుంచుపల్లి ఎంపిడిఓ సుభాషిణి, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

# మొక్కజొన్న సాగుకు సిద్ధం



**ప్రజాపక్షం/కల్లూరుః** కల్లూరు మండల పరిధిలోని పలు గ్రామాలలో మెట్టపంట రైతులు పత్తి నష్టాన్ని పూడ్చుకునేందుకు పత్తి పంటను తొలగించి అదే స్థానంలో మొక్కజొన్న సాగుకు సిద్ధమయ్యారు. మండలంలో ఖరీఫ్ సీజన్లో 3800 ఎకరాలలో పత్తి పంట సాగు చేయగా అధిక వర్షాలతో చీడపీడలుతో దిగుబడి రాక ఆ పంటను తొలగించి మక్క పంటను సాగు చేసుకునేందుకు సిద్ధమయ్యారు. మండల పరిధిలోని కప్పల బంధం, లక్ష్మీ పురం, బత్తులపల్లి, పేరువంచ, చిన్న కోరుకొండి, పెద్ద కోరుకొండి, దారుక బంజర్, చంద్రుపట్ల, రఘునాథ గూడెం , తాళ్లూరు వెంకటాపురం, తదితర గ్రామాలలో 1000 ఎకరాలలో ట్రాక్టర్ తో దుక్కులు దున్ని పలు రకాల బేర్ , సిరి , అడ్వాంటే, పయనీర్, సింగెంటా, క్రిస్టల్ కంపెనీల విత్తనాలతో ఆయా కంపెనీల సలహాలు సూచనలతో ఖచ్చితమైన ఒప్పందముతో విత్తనాలు నాటుతున్నారు. మొదటిగా పత్తి పంట అధిక వర్షాలతో నష్టం రాగా మొక్కజొన్న పంట ద్వారా పలు రకాల కంపెనీల సలహాలు సూచనలతో మొక్కజొన్న సాగును చేస్తున్నట్లు రైతులు తెలుపుతున్నారు. గత సంవత్సరం మొక్కజొన్న సాగు చేసిన రైతులకు లాభం రావడంతో ఈసారి అదే పంటను రైతులు సాగు చేస్తున్నారు. మొక్కజొన్న సాగుపై వ్యవసాయ శాఖ అధికారులు సలహాలు, సూచనలు గ్రామాల్లో సదస్సులు నిర్వహించి అవగాహన కల్పించడంతో మొక్కజొన్న పట్ల సాగుకు సిద్ధమయ్యారు.

# వేంసూరు పోలీస్ స్టేషన్ ఆకస్మికంగా తనిఖీ



**ప్రజాపక్షం/సత్తుపల్లిః** కల్లూరు ఏసీపీ వసుంధర యాదవ్ ఐపీఎస్ వేంసూరు పోలీస్ స్టేషన్‌ను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ లోని రికార్డులను సమీక్షించారు, స్వాధీనం చేసుకున్న వాహనాలను పరిశీలించి సిసిఎన్ టిఎస్ 2.0, ఈసమన్స్ ,టిఎస్‌సిఓపి లను కఠినంగా ఉపయోగించాలని సిబ్బందిని ఆదేశించారు.పెండింగ్‌లో ఉన్న ఎఫ్ఐఆర్ లను పరిశీలించి, చురుకైన పోలీసింగ్‌పై దృష్టి పెట్టాలని, రౌడీలు, హిస్టరీషీటర్లపై నిఘా ఉంచాలని బృందాన్ని ఆదేశించారు. సమర్థవంతమైన క్షేత్ర పర్యవేక్షణ కోసం కానిస్టేబుళ్లను గ్రామ పోలీసు అధికారులు (విపిఓలు)గా నియమించాలని ఆమె ఎస్ హెచ్ ఓని ఆదేశించారు. స్థానిక నిఘాను బలోపేతం చేయడానికి సీసీ టివి కెమెరాల ఏర్పాటు కోసం కమ్యూనిటీ అవగాహన ప్రచారాన్ని ప్రారంభించాలని ఏసిపి సిబ్బందిని ఆదేశించారు. సిఈఐఆర్ పోర్టల్ ద్వారా దొంగిలించబడిన మొబైల్ ఫోన్‌లను త్వరగా స్వాధీనం చేసుకోవాలని ఆదేశించారు. అనంతరం పాడి చెక్‌పోస్ట్‌ను సందర్శించి, పోలీసులు చేసిన ఏర్పాట్లను పరిశీలించారు.

# రఘునాథపాలెంలో మొదటి విడతలో ఎన్నికలు

**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** గ్రామ పంచాయతీ ఎన్నికల్లో భాగంగా రఘునాథపాలెం మండలంలో మొదటి విడతలో డిసెంబర్ 11న ఎన్నికలు జరగనున్నాయి. మొత్తం 37 సర్పంచ్ స్థానాలకు, 308 వార్డు స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఎన్నికలకు సంబంధించి ఈ నెల 27 నుండి 29 వరకు స్వీకరిస్తారు. 30న నామినేషన్ల పరిశీలన, ఒకటవ తేదీన అప్పీల్స్, రెండవ తేదీన జాబితా ప్రకటన, మూడవ తేదీన ఉప సంహారణ అదే రోజున అభ్యర్థుల జాబితాను ప్రకటించనున్నారు. మొదటి విడతకు 11వ తేదీ ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం ఒకటి వరకు పోలింగ్ నిర్వహిస్తారు. అదే రోజున మధ్యాహ్నం రెండు గంటల నుంచి లెక్కింపు ప్రారంభమవుతుంది. ఈనెల 27 నుంచి నామినేషన్లు ప్రారంభం కానున్న నేపథ్యంలో నామినేషన్ల స్వీకరణకు అధికారులు సమాయత్తం అవుతున్నారు. ఈ దఫా ముగ్గురు పిల్లలు ఉన్న అభ్యర్థులు పోటీ చేసేందుకు అవకాశం కల్పించారు.

# ఏఎంసి ఛైర్మన్‌ను కలిసిన చాంబర్ నూతన పాలక వర్గం



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ యరగర్ల హన్మంతరావు, మార్కెట్ సెక్రటరీ ప్రవీణ్‌కుమార్ రెడ్డి లను చాంబర్ ఆఫ్ కామర్స్ నూతన పాలక సభ్యులు మర్యాద పూర్వకంగా కలిశారు. మంగళవారం మార్కెట్ కార్యాలయంలో నూతనంగా ఎన్నికైన చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కురువెళ్ల ప్రవీణ్ కుమార్, సోమా నర్సింహారావు (జివై నరేష్), కోశాధ్యక్షులు తల్లాడ రమేష్, పాలక వర్గ సభ్యులు ఛైర్మన్ యరగర్ల హన్మంతరావు, కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ రెడ్డి లను మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా చాంబర్ ఆఫ్ కామర్స్‌కు నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, కార్యదర్శులతో పాటు పాలక వర్గాన్ని ఛైర్మన్ యరగర్ల హన్మంతరావు, కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ రెడ్డి లను శాలువలతో సత్కరించారు. నూతనంగా ఎన్నికైన పాలక వర్గానికి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు బత్తిని నర్సింహారావు, సహయ కార్యదర్శి బాదె రమేష్, సెంట్రల్ ఈసి సభ్యులు మాటేటి కిరణ్‌కుమార్, వంగవీటి హరీష్, రాయపూడి రవికుమార్, పోట్ల రామనాథం, ఎస్. శేషగిరిరావు ఉన్నారు.

# పాఠశాలకు మైక్ సెట్ ఆట వస్తువులు వితరణ



**ప్రజాపక్షం/కల్లూరుః** కల్లూరు మండల పరిధిలోని పెద్ద కోరుకొండి ప్రాథమికోన్నత పాఠశాలకు గ్రామ వాస్తవ్యులు చేపల సొసైటీ జిల్లా మాజీ అధ్యక్షులు మరుసకట్ల బాలరాజు (శౌరి) రూ. 30,000 విలువచేసే మైక్ సెట్, ఆట వస్తువులు వితరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు, ఆటల్లో రాణించాలని, పాఠశాల అభివృద్ధికి రాబోయే రోజుల్లో అభివృద్ధికి కృషి చేస్తానని ఆయన అన్నారు. ఈ సందర్భంగా ఆయనను పాఠశాల ప్రధానోపాధ్యాయులు నామ కృష్ణమూర్తి, ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు, గ్రామస్తులు దాతను అభినందించారు.

# ఇందిరమ్మ చీరలు పంపిణీ



**ప్రజాపక్షం/పెనుబల్లిః** పెనుబల్లి మండలం యడ్ల బంజరు గ్రామంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు సీతారామారావు ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని సోమరాజు సీతా రామారావు ప్రారంభించి మహిళలకు స్వయంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో డ్వాక్రా మహిళలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# పెనుబలిలో డిసెంబర్ 17న పంచాయతీ ఎన్నికలు

**ప్రజాపక్షం/పెనుబల్లిః** గ్రామపంచాయతీ ఎన్నికలకు ఎన్నికల నగారా మంగళవారం మోగింది. పెనుబల్లి మండలం పంచాయతీ సర్పంచ్, వార్డు మెంబర్లకు ఎన్నికలను మూడో విడతగా ఎన్నికల కమిషన్ ప్రకటించింది. అందులో భాగంగా డిసెంబరు 17న పోలింగ్ జరగనుంది. నామినేషన్ల ప్రక్రియ డిసెంబర్ 3 నుండి 5వ తేదీ వరకు కొనసాగుతుంది. ఎనిమిదో తారీకు ఉపసంహరణ ఉంటుందని అధికారులు తెలిపారు. మండలంలోని 33 పంచాయతీలకు డిసెంబర్ 17 ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. మండలంలో మొత్తం 33 పంచాయతీలకు గాను 290 వార్డులను, 290 పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేశారు. అందుకు కావలసిన ఏర్పాట్లను సిద్ధం చేశారు.